

మంత్రి లోకేశ్‌కు వేంకటేశ్వరస్వామి ప్రతిమ అందజేస్తున్న సిఫీ చైర్మన్ రాజు వేగేశ్న. పక్కన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఏపీఐఐసీ చైర్మన్ రామరాజు

గంగపుత్రుల కన్నెర్ర

బల్క్‌డ్రగ్ పార్కు వద్దంటూ రోడ్డెక్కిన మత్స్యకారులు

- రాజయ్యపేట నుంచి నక్కపల్లికి ర్యాలీ
- జాతీయ రహదారిపై బైఠాయింపు
- ఆర్డీవో, డీఎస్పీ నచ్చజెప్పినా ససేమిరా
- ఇరువైపులా కిలోమీటర్ల మేర నిలిచిపోయిన వాహనాలు
- తీవ్ర ఇబ్బందులు పడిన ప్రయాణికులు
- ఆర్డీవో సమాచారంతో కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా రాక
- 15న రాజయ్యపేట వచ్చి మాట్లాడతానని కలెక్టర్ హామీ
- నాలుగు గంటల అనంతరం ఆందోళన విరమణ



జాతీయ రహదారిపై బైఠాయించిన మత్స్యకారులు

నక్కపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పార్కు వద్దంటూ మండలంలోని రాజయ్యపేట కేంద్రంగా 29 రోజుల నుంచి ఆందోళన చేస్తున్న మత్స్యకారుల ఆగ్రహం ఒక్కసారిగా కట్టలు తెంచుకుంది. తమ మనుగడ కోసం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్నప్పటికీ పోలీసులు అడుగడుగునా ఇబ్బందులు పెడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజయ్యపేట నిరసన శిబిరం నుంచి ఆదివారం మధ్యాహ్నం అనూహ్యంగా వందల సంఖ్యలో మత్స్యకారులు నడుచుకుంటూ నాలుగు కిలోమీటర్ల దూరంలో వున్న నక్కపల్లికి బయలుదేరారు. దారిలో పోలీసులు అడ్డుకోవడానికి ప్రయత్నించినా ఆగలేదు. మహిళలు, పోలీసులను నెట్టుకుంటూ ముందుకు సాగారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఉపమాక హైవే జంక్షన్‌కు చేరుకుని రోడ్డుపై బైఠాయించారు. దీంతో ఇరువైపులా వాహనాలు ఆగిపోవడం మొదలైంది. అధికారులు, పోలీసులు ఎంత నచ్చజెప్పినా ఆందోళన విరమించలేదు. మత్స్యకార మహిళల పట్ల దురుసుగా ప్రవర్తించిన అడ్డరోడ్డు సీఐ రామకృష్ణ, నక్కపల్లి ఎస్ఐ సన్నిబాబును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. బల్క్‌డ్రగ్ పార్కు అనుమతులను రద్దు చేయాలని, అంతవరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని స్పష్టం చేశారు. మరోవైపు జాతీయ రహదారిపై అటు తుని, ఇటు అడ్డరోడ్డు వైపు వాహనాలు పెరిగిపోతున్నాయి. ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. సమాచారం అందుకున్న నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ, డీఎస్పీ పి.శ్రీనివాసరావు ఇక్కడకు వచ్చారు. ఆందోళన చేస్తున్న మత్స్యకారులతో మాట్లాడేందుకు ప్రయత్నించగా వారు ససేమిరా అన్నారు. బల్క్ డ్రగ్ పార్కుపై కమిటీ వేస్తానని స్థానిక ఎమ్మెల్యే, హోం మంత్రి అయిన వి.అనిత చెప్పారని ఆర్డీవో తెలపగా.. ఆ కమిటీతో తమకు పనిలేదని ఆందోళనకారులు స్పష్టం చేశారు. కలెక్టర్ వచ్చి తమకు సమాధానం చెప్పే వరకు ఆందోళన విరమించేది లేదన్నారు. దీంతో ఆర్డీవో రమణ, కలెక్టర్ విజయకృష్ణన్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. అనంతరం కలెక్టర్ మీతో మాట్లాడతారని ఆర్డీవో చెప్పగా, మత్స్యకారులు వినిపించుకోలేదు. కలెక్టర్ ఇక్కడకు రావాల్సిందేనని పట్టుబట్టారు. అప్పటికే సుమారు ... మిగతా 6వ పేజీలో



హైవేపై నిలిచిపోయిన వాహనాలు



ఆందోళనకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

విశాఖే ఆర్థిక రాజధాని

జిల్లా దశ, దిశ మారుద్దాం



ప్రజాప్రతినిధులు, అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

- అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయండి
- ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయం
- ఇక్కడి ప్రజల మద్దతు ఎప్పుడూ టీడీపీకే
- ఐటీ, మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేశ్

విశాఖపట్నం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): **రాష్ట్రానికి ఆర్థిక రాజధాని విశాఖపట్నమేనని, దీనిని మరింత అభివృద్ధి చేసేందుకు వీలుగా పక్కా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఐటీ, మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేశ్ దిశా నిర్దేశం చేశారు. భవిష్యత్తులో చోటుచేసుకునే మార్పులు, అవసరాలను దృష్టిలో పెట్టుకుని విశాఖపట్నం దశ, దిశ మార్చేలా ప్రణాళికలు ఉండాలన్నారు. రానున్న ఐదేళ్లలో ఐటీ రంగంలో యువతకు 5 లక్షల ఉద్యోగాలను కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. శ్రీకాకుళం నుంచి అనకాపల్లి వరకు నాలుగు జిల్లాలు, అరకు, పాడేరుతో కలిపి గ్రేటర్ విశాఖ ఎకనమిక్ జోన్ అభివృద్ధి, ఇతర అంశాలపై ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.**

ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ బెంగళూరు, పుణె లాంటి నగరాల్లో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలు విశాఖలో ఉత్పన్నం కాకుండా చూడాలని, విశాలంగా రోడ్లు అభివృద్ధి చేయాలని సూచించారు. విశాఖ వేదికగా అనేక కంపెనీలు వస్తున్నాయని, రానున్న 30 సంవత్సరాలకు తగ్గట్టుగా మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలన్నారు. ఇందుకు ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయంతో కూడిన మేధోపరమైన చర్చ జరగాలన్నారు. అనేక కంపెనీలు, అతిపెద్ద ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకాబోతున్నాయని, దీంతో ఈ రీజియన్‌లోని యువతకు ఐదు లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సరైన విధంగా ఆలోచించి ప్రణాళికలు తయారుచేయాలని నిర్దేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందిలేని విధంగా మిషన్ మోడ్‌లో అభివృద్ధి జరగాలని, వారికి ఆమోదయోగ్యమైన విధంగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో విశాఖ రీజియన్‌లో ఐటీ పార్కుల ఏర్పాటుకు అనువుగా ల్యాండ్ బ్యాంకు సిద్ధంచేయాలని ఆదేశించారు.



సిఫీకి శంకుస్థాపన చేస్తున్న మంత్రి లోకేశ్



విశాఖ విమానాశ్రయంలో మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు, గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు

టీడీపీకే ప్రజా మద్దతు

అంతకుముందు రుషికొండలో సిఫీ ఎడ్జ్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం మంత్రి లోకేశ్ ఏ-1 కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విశాఖ వాసులు ఎల్లప్పుడూ తెలుగుదేశం పార్టీకి పట్టం కడుతున్నారని, వారి పూర్తి మద్దతు టీడీపీకేనని అన్నారు. హుద్‌హుద్ సమయంలో ... మిగతా 6వ పేజీలో

తీరానికి.. తాటి కవచం

గ్రేట్ గ్రీన్ వాల్ కాన్సెప్ట్ అమలుకు అటవీశాఖ ప్రణాళిక



నక్కపల్లి మండలంలో సముద్ర తీరంలో తాటి చెట్లు

- ఉత్తరాంధ్ర పరిధిలో 2.5 లక్షల తాటిచెట్ల పెంపకం
- సరుగుడు, ఇతర మొక్కలు నాటేందుకు నిర్ణయం
- మడ అడవుల పెంపకానికి శ్రీకారం
- తుఫాన్ల నుంచి రక్షణకు చర్యలు



తీరం పొడవునా నాటేందుకు సిద్ధంచేసిన తాటి టెంకలు

విశాఖపట్నం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): **బంగాళాఖాతంలో సంభవించే తుఫాన్‌ల సమయంలో తొలుత ప్రభావితమయ్యేది తీర ప్రాంతమే. ఆ సమయంలో వీచే పెనుగాలుల ధాటికి అపార నష్టం వాటిల్లుతుంది. అలలు ఎగిసిపడి సమీప గ్రామాల్లోకి సముద్ర జలాలు చొరబడి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్లు, భూములు, కమ్యూనికేషన్లు, విద్యుత్ స్తంభాలు, టవర్లు దెబ్బతింటాయి. తీరంపొడవునా కోత తీవ్రత ఎక్కువవుతుంది. దీంతో నగరంలోని బీచ్‌రోడ్డు నిత్యం కోతకు గురై నష్టం సంభవిస్తోంది. ఇలాంటి విపత్తుల నుంచి తీర ప్రాంతానికి రక్షణగా నిలిచేలా 'గ్రేట్‌గ్రీన్‌వాల్' అమలుకు రాష్ట్ర ప్రభుత్వం బృహత్తర ప్రణాళిక రూపొందించి అమలుకు శ్రీకారం చుట్టింది.**

ఐదేళ్లపాటు అమలుచేసే 'గ్రేట్‌గ్రీన్‌వాల్ కార్యక్రమం'లో తీరానికి ఆనుకుని తొలి వరుసలో తాటిచెట్లు, రెండో వరుసలో సరుగుడు, ఆ తరువాత జీడి, అనువుగా ఉండే చోట మడ అడవుల పెంపునకు విశాఖ సర్కిల్ అటవీశాఖ కార్యాచరణ అమలుచేస్తోంది. సర్కిల్ పరిధిలోని ఇచ్ఛాపురం నుంచి పాయకరావుపేట వరకు 344 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉంది. తీరం పొడవునా సుమారు ఎనిమిదివేల హెక్టార్ల అటవీశాఖ, దీనికి ఆనుకుని రెవెన్యూశాఖకు భూములు ఉన్నాయి. తీరం నుంచి భూ ఉపరితలం వైపు లోపలికి ఐదు కిలోమీటర్ల వెడల్పులో 'గ్రేట్‌గ్రీన్‌వాల్ కార్యక్రమం' అమలుచేస్తారు. మొదటి వరుసలో తాటి వనాలు పెంచుతారు. ఇందుకుగాను విశాఖ సర్కిల్‌లో రెండున్నరలక్షల తాటిచెట్లు పెంచేందుకు టెంకలు సిద్ధంచేశారు. విశాఖ, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో తాటి పొదల నుంచి వీటిని సేకరించారు. టెంకలను తీరం పొడవునా నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐదేళ్లపాటు వీటిని నాటాలని ప్రణాళికలో పొందుపరిచారు.

తుఫాన్ల ధాటిని నిలువరించేలా..

తీరంలో ఉప్పుగాలులకు తట్టుకుని తాటిచెట్లు పెరుగుతాయి. సుమారు 40 నుంచి 50 అడుగుల ఎత్తు పెరుగుతాయి. తుఫాన్‌గాలులను నిలువరిస్తాయి. గతంలో దివిసీమ తుఫాన్ తరువాత కోస్తాతీరం వెంబడి భారీగా తాటి, సరుగుడు వనాలు పెంచారు. ఆ తరువాత రెండోవరుసలో సరుగుడు వనాలు పెంచనున్నారు. ఈ ఏడాది 20 లక్షల సరుగుడు మొక్కలు నాటాలని అటవీశాఖ నిర్ణయించింది. వచ్చే ఏడాది నుంచి 30 నుంచి 40 లక్షల సరుగుడు మొక్కలు నాటుతారు. ఆ తరువాతి వరుసలో రైతుల భూముల్లో జీడితోటల పెంపకాన్ని ప్రోత్సహించనున్నారు. శ్రీకాకుళం జిల్లాలో అనువుగా ఉండే చోట మడ అడవులు పెంచుతారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసే పలు పథకాల ద్వారా తాటి, సరుగుడు, మడ అడవులు పెంపకం చేపడతారు. కోస్తా తీరం మొత్తం ఐదేళ్లలో ఈ ప్రాజెక్టు అమలుకు రూ.500 కోట్లు వెచ్చించనున్నారు.

కార్యాచరణ రూపొందించాం

'గ్రేట్‌గ్రీన్‌వాల్ కార్యక్రమం' అమలుకు శాఖాపరంగా ... మిగతా 6వ పేజీలో

విత్తన గిడ్డంగి రెడీ

త్వరలోనే ప్రారంభం

- రైతులకు అందుబాటులోకి రానున్న సేవలు
- గత వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యం
- నాలుగేళ్లపాటు పునాదులకే పరిమితం
- కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పనులు వేగవంతం
- ఏడాదిన్నర కాలంలోనే నిర్మాణం పూర్తి



గంధవరంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న విత్తన గిడ్డంగి, విత్తన శుద్ధి కేంద్రం

చోడవరం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): **గత వైసీపీ ప్రభుత్వంలో పునాదులకే పరిమితమైన గంధవరంలోని విత్తన గిడ్డంగి, విత్తన శుద్ధి కేంద్రం నిర్మాణం కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిన్నరలో పూర్తయింది. ప్రస్తుతం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఈ కేంద్రం ద్వారా ఉమ్మడి జిల్లా రైతాంగానికి అవసరమైన విత్తనాలు సరఫరా కానున్నాయి.**

ఉమ్మడి జిల్లాలో రైతాంగానికి అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉంచే లక్ష్యంతో 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం గంధవరంలో విత్తన గిడ్డంగి, విత్తన శుద్ధి కేంద్రం నిర్మాణానికి అనుమతి ఇవ్వడంతో పాటు 5 ఎకరాల స్థలం కేటాయించింది. అయితే ఆ తరువాత వైసీపీ అధికారంలోకి రాగా, 2020 జూలై నెలలో అప్పటి వ్యవసాయశాఖ మంత్రి కన్నబాబు, మంత్రి అవంతి శ్రీనివాస్, ఎంపీ విజయసాయిరెడ్డిలు ఈ కేంద్రం నిర్మాణానికి ఆర్భాటంగా శంకుస్థాపన చేసి శిలాఫలకం వేశారు. తరువాత పునాదుల స్థాయిలోనే నిలిచిపోయినా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పర్యవేక్షణలో నిర్మాణ పనులు శరవేగంగా సాగాయి. ఎట్టకేలకు ఈ గిడ్డంగిని పూర్తి చేశారు. ఈ కేంద్రం ప్రారంభమైన తరువాత విజయనగరం వెళ్లనవసరం లేకుండానే అనకాపల్లి జిల్లాతో పాటు అల్లూరి, విశాఖ జిల్లాలకు సైతం గంధవరం నుంచే విత్తనాలు సరఫరా కానున్నాయి. ఉమ్మడి జిల్లా వాతావరణానికి అనుకూలమైన వరి విత్తనాలను ఈ ప్రాంతంలో ఉత్పత్తి చేసి, ఈ కేంద్రం ద్వారా రైతులకు పంపిణీ చేయనున్నారు.



వైసీపీ హయాంలో విత్తన గిడ్డంగి పరిస్థితి! (ఫైల్ ఫొటో)

అనుమతి వచ్చిన వెంటనే ప్రారంభం

విత్తన గిడ్డంగి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన ఈ గిడ్డంగిని ఆ శాఖ అధికారులు మా సంస్థకు అప్పగించాల్సి ఉంది. ఈ ప్రక్రియ ఈ నెలలో పూర్తికానుంది. ఉన్నతాధికారుల నుంచి అనుమతి వచ్చిన తరువాత కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ గిడ్డంగి ప్రారంభానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తాం. పనులన్నీ పూర్తయినందున ఇక ప్రారంభోత్సవమే మిగిలింది. ఈ నెలాఖరుకు లేదా వచ్చే నెలలో దీనిని ప్రారంభించే అవకాశం ఉంది.

- కేపీ నాగసాయిబాబు, జిల్లా మేనేజర్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ

జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో

నాగజ్యోతి సత్తా

- రెండు స్వర్ణ, ఒక రజత పతకాలు సాధించిన ఉపాధ్యాయిని



జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సాధించిన పతకాలతో నాగజ్యోతి

రోలుగుంట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్-2025 పోటీల్లో రోలుగుంట జడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయిని పీఎం నాగజ్యోతి సత్తా చాటారు. కర్ణాటక స్టేట్ పవర్ లిఫ్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించిన ఈ పోటీల్లో 8 రాష్ట్రాలకు చెందిన సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. దీనిలో భాగంగా మాస్టర్స్ 72 కేజీల విభాగంలో పాల్గొన్న నాగజ్యోతి డెడ్ లిఫ్ట్, బెంచ్ ప్రెస్, పుష్-పుల్ విభాగాల్లో అద్భుత ప్రదర్శన కనబరిచారు. బెంచ్ ప్రెస్ విభాగంలో స్వర్ణం, డెడ్ లిఫ్ట్ విభాగంలో స్వర్ణం, పుష్- పుల్ విభాగంలో రజత పతకాన్ని సాధించారు. నాగజ్యోతిని పాఠశాల హెచ్ఎం శేషగిరిరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రతికా, స్మృతి పోరు వృథా!



స్మృతి మంధాన, ప్రతికా రావల్

భారీ టార్గెట్‌ను ఛేదించిన ఆస్ట్రేలియా

- సెంచరీతో కదంతొక్కిన అలిస్సా హీలి
- భారత్‌కు మరోసారి నిరాశ
- ఏసీఏ- వీడీసీఏ స్టేడియంలో పరుగుల వరద
- క్రికెట్ అభిమానులకు ఫుల్ జోష్

విశాఖపట్నం, స్పోర్ట్స్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): **సిక్సర్లు, బౌండరీలతో పీఎం పాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియం హోరెత్తింది. భారత్ మహిళా బ్యాటర్లు పసందైన క్రికెట్ మజానందించినా ప్రేక్షకులకు గెలుపు ఆనందం దక్కలేదు. భారత ఓపెనర్లు ప్రతికా రావల్, స్మృతి మంధాన సొగసైన షాట్‌లతో ప్రేక్షకులకు కనువిందు చేసినా ఫలితం లేకపోయింది. భారీ లక్ష్యాన్ని ఆస్ట్రేలియా మహిళలు సునాయాసంగా ఛేదించి భారత్‌కు ఝలక్ ఇచ్చారు.**

మహిళల వన్డే ప్రపంచ కప్ టోర్నీలో భాగంగా ఆదివారం పీఎంపాలెంలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్‌పై ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. భారత్ ... మిగతా 6వ పేజీలో



అలిస్సా హీలి బ్యాటింగ్

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



కబడ్డీ పోటీల వాల్‌పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మునగపాక మండలం వాడ్రాపల్లిలో ఈనెల 23, 24 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీపోటీల వాల్‌పోస్టర్‌ని అచ్యుతాపురంలో గల తన స్వగృహంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆదివారం ఆవిష్కరించారు. గౌరీ పరమేశ్వరుల మహోత్సవం సందర్భంగా గౌరీ యూత్, వీరాంజనేయ యూత్ సంయుక్తంగా గ్రామంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈకార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కంటి, హోమియో వైద్య శిబిరానికి విశేష స్పందన

మునగపాక, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మునగపాకలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి, హోమియో వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిది. గణేష్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరంలో 138 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా.. వారిలో 22 మందిని ఆపరేషన్‌కు గుర్తించారు. 50 మందికి పైగా హోమియో వైద్య సేవలు పొందారు. వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. శంకర్ ఫౌండేషన్ కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్ అవసరమైన వారిని బస్సులో విశాఖ తరలించారు. ఈ శిబిరంలో హోమియో వైద్యులు కాండ్రేగుల తులసి, దాడి హేమాన్విత, నిర్వాహకులు దాడి శ్రీరామ్మూర్తి, దాడి సాంబ, టెక్కలి దేవకీ పాల్గొన్నారు.

జనరాజదాస్‌కు టీడీపీ నేత నివాళి

మునగపాక, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్ఈసీఎస్ మాజీ చైర్మన్, ఉమ్మడి విశాఖ జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు స్వర్గీయ పెంటకోట జనరాజదాస్ చిత్రపటానికి టీడీపీ శ్రేణులు నివాళులర్పించారు. ఆదివారం నాగులాపల్లిలో జనరాజదాస్ 67వ జయంతి వేడుకలు టీడీపీ నాయకుడు దొడ్డి శ్రీను ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా ఆయన పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీచర్ కుటుంబానికి పీఆర్‌టీయూ ఆర్థిక సాయం

ఎస్.రాయవరం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వాకపాడు స్కూల్ ఉపాధ్యాయుడు వంకల సత్యం కుటుంబానికి మండల పీఆర్‌టీయూ బృందం చేయూతగా నిలిచింది. మండల పీఆర్‌టీయూ బృందం సమకూర్చిన రూ.1,02,000 నగదును ఆదివారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు సత్యం కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

చెర్లోపాలెంలో పారిశుధ్య పనులు

మునగపాక, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో చెర్లోపాలెం శివారు గవరవీధిలో పారిశుధ్య పనులు ఆదివారం మొదలయ్యాయి. 'చెర్లోపాలెం శివారులో కలుషిత నీరు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై పంచాయతీ పాలకవర్గం స్పందించింది. తాగునీటి కొళాయి వద్ద శుభ్రం చేశారు. తాగునీరు కలుషితం కాకుండా మరోచోట కుళాయి ఏర్పాటు చేస్తామని ఉప సర్పంచ్ బోజా శ్రీనివాసరావు, అప్పికొండ సత్తిబాబు తెలిపారు. రహదారిలో పిచ్చి తుప్పలను కూడా తొలగిస్తున్నామన్నారు. సమస్యలు తలెత్తకుండా పక్కా పనులు చేయమని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సూచించారన్నారు.

'రైతుకు నష్టపరిహారం ఇవ్వకుండా రోడ్డు వేయడం అన్యాయం'

రాంబిల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి):పూర్తిస్థాయిలో నష్టపరిహారం ఇవ్వకుండా రైతు సాగులో ఉన్న భూమిలో సిరిమాన్ కెమికల్ కంపెనీ కోసం రోడ్డు వేస్తుండడం అన్యాయమని ఎస్ఈజడ్ నిర్వాసితుల సంఘం నాయకుడు జి.దేముడునాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని లాలంకోడూరు పంచాయతీ శివారు చాటమెట్టలోని రైతు లాలం అప్పలనాయుడుతో కలిసి రోడ్డు పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా దేముడునాయుడు మాట్లాడుతూ రైతు అప్పలనాయుడు పంట భూమికి పూర్తిస్థాయిలో నష్టపరిహారం ఇవ్వకుండా రోడ్డు వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నేతలు వై.రాము, సీహెచ్ ఎల్లనాయుడు,కాసుబాబు పాల్గొన్నారు.

మరిడితల్లి ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

మునగపాక, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తోటాడ-గవర్ల అనకాపల్లి గ్రామస్థులు నిర్మిస్తున్న మరిడితల్లి ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళాన్ని తోటాడకు చెందిన స్వర్గీయ బుద్ధ పశుపతిరావు జ్ఞాపకార్థం అతని భార్య వరలక్ష్మి, కుమారుడు పురోగామి అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులుగా కలుసుకున్న పూర్వ విద్యార్థులు



శ్రీప్రకాష్ విద్యా సంస్థలో గ్రూపు ఫొటో దిగిన పూర్వ విద్యార్థులు

పాయకరావుపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ నందు 1997-98లో బీఈడీ చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశానికి కుటుంబ సభ్యులతోసహా వచ్చిన పూర్వ విద్యార్థులు ఒకరినొకరు పలకరించుకుని సందడి చేశారు. వీరిలో అత్యధికులు ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు హెచ్ఎంలుగా, ఉపాధ్యాయులుగా పిల్లలకు పాఠాలు చెప్పేవారుకాగా 28 సంవత్సరాల తరువాత కలుసుకుని అలనాటి తీపి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకొని ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే.నరసింహారావు మాట్లాడుతూ సమాజ హితమే ఉపాధ్యాయుల ప్రథమ లక్ష్యమన్నారు. విద్యార్థులకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.

టాలెంట్ టెస్ట్‌కు 700 మంది హాజరు

ఎలమంచిలి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏబీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని ట్రస్ట్ చైర్మన్ ఎంఎస్. స్వరూప్ అన్నారు. ఆదివారం స్థానిక వాగ్దేవి కళాశాల ఆవరణలో విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టాలెంట్ టెస్టుకు 700 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఈనెల 22వ తేదీన ఎలమంచిలిలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. టాలెంట్ టెస్ట్ విజేతలకు నగదు, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏబీ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తుట్టా నాగశ్రీను, అప్పలరాజు, అప్పలశెట్టి, దుర్గాప్రసాద్, రామ్‌కుమార్, కళాశాల ప్రతినిధి శేషగిరిరావు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం : సుందరపు

రాంబిల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో యువతను భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశంతోనే నేను-నా యువత కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ఎమ్మెల్యే విజయకుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని వెంకటాపురం జనసేన పార్టీ కార్యాలయంలో నేను-నా యువత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో ఎంతో మేధా సంపత్తి దాగి ఉందని, వారి అభిప్రాయాలను పంచుకోవడం ద్వారా మరింత అభివృద్ధి జరగడానికి అవకాశం ఉంటుందన్నారు.

ట్రాఫిక్ జామ్‌తో ప్రయాణికుల అవస్థలు

తాండవ జంక్షన్ వద్ద నిలిచిన నిలుపుదల... పాయకరావుపేట నుంచి వెనుదిరిగిన బీసీవై అధినేత రామచంద్రయాదవ్



బస్సులు ఆగిపోవడంతో నడిచివెళుతున్న ప్రయాణికులు



రాజమండ్రికి తిరిగి వెళ్లిపోతున్న బీసీవై అధినేత రామచంద్రయాదవ్

పాయకరావుపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటుకు వ్యతిరేకంగా నక్కపల్లి జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టిన నేపథ్యంలో వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. బస్సులు, వ్యాన్లు, కార్లలో ఉన్న వారు ఇబ్బందులు పడ్డారు. తాగేందుకు నీరు దొరక్క ఇబ్బంది పడ్డారు. రాజమండ్రి నుంచి విశాఖ వైపు వెళుతున్న వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోతుండడంతో పోలీసులు తాండం జంక్షన్ వద్ద వాహనాలు నిలిపివేశారు. అలాగే పలు వాహనాలను నర్సీపట్నం, మాకవరపాలెం, తాళ్లపాలెం మీదుగా జాతీయ రహదారిపైకి మళ్లించారు. సీఐ జి.అప్పన్న ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు కష్టపడాల్సి వచ్చింది. ట్రాఫిక్ జామ్ కావడంతో మత్స్యకారులకు మద్దతు పలికేందుకు ఆదివారం సాయంత్రం రాజమండ్రి నుంచి రోడ్డు మార్గం ద్వారా వచ్చిన బీసీవై అధినేత రామచంద్రయాదవ్ పాయకరావుపేట నుంచి వెనుదిరిగారు.

ఎస్.రాయవరంలో..

నక్కపల్లి వద్ద మత్స్యకారులు జాతీయ రహదారిపై ఆందోళన చేయడంతో ట్రాఫిక్‌జామ్‌లో నిలిచిపోయిన బస్సుల్లో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. బస్సుల్లో ప్రయాణికులు వారి గమ్య స్థానాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఎలమంచిలిలో..

నక్కపల్లి వద్ద రాజయ్యపేట మత్స్యకారులు నిరసన తెలపడంతో హైవేపై గంటల తరబడి వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు. రేగుపాలెం జంక్షన్ వద్ద రూరల్ ఎస్ఐ ఉపేంద్ర తన సిబ్బందితో వాహనాల రాకపోకలను దారి మళ్లించే చర్యలు తీసుకున్నారు. ఎట్టకేలకు సాయంత్రం 6 గంటలు దాటిన వాహనాలు రాకపోకలు ప్రారంభమయ్యాయి.

నట శిఖరం లంక సత్యానంద్ : దాడి



లంక సత్యానంద్‌ను సత్కరించిన మాజీమంత్రి దాడి వీరభద్రరావు, తదితరులు



ఛత్రపతి శివాజీ మహారాజ్ నాటకం ప్రదర్శన

మునగపాక, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సినీ, నాటక రంగంలో స్టార్ మేకర్ లంక సత్యానంద్ నట శిఖరం అని చెప్పకతప్పదని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు కొనియాడారు. ఆదివారం ఉమ్మడి విశాఖ జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు స్వర్గీయ పెంటకోట జనరాజదాస్ 67వ జయంతి వేడుకల్లో భాగంగా స్థానిక నందీశ్వర ప్రాంగణం తులసీ కళావేదికపై జరిగిన కార్యక్రమంలో స్టార్ మేకర్ లంక సత్యానంద్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దాడి వీరభద్రరావు మాట్లాడుతూ సత్యానంద్ నాటక రంగానికి ఎనలేని సేవలు అందించారన్నారు. సత్యానంద్ రూపొందించిన బొమ్మలాట 102 రోజులు టిక్కెట్ ప్రదర్శన జరిగి దేశవ్యాప్తంగా గుర్తింపును సొంతం చేసుకుందన్నారు. దశాబ్దాలు క్రితం ఆయన రూపొందించిన బొమ్మలాటలో పాత్రలు నేటి రాజకీయరంగంలో దర్శినమిస్తోందన్నారు. లీడర్ పత్రిక అధినేత వీవీ.రమణమూర్తి మాట్లాడుతూ జిల్లాలో మునగపాక గ్రామం నాటకరంగాన్ని గుండెల్లో పెట్టుకొని ఆరాధిస్తుందని చెప్పడం అతిశయోక్తి అనిపించుకోదన్నారు. స్టార్ మేకర్ లంక సత్యానంద్ మాట్లాడుతూ బాల నటుడుగా మునగపాక వేదికపై 1969లో వేసిన నాటకంలో పాత్ర ద్వారా తొలి ప్రశంసాపత్రం అందుకున్నానని తెలిపారు. పవన్ కల్యాణ్, ప్రభాష్ వంటి నటులే కాకుండా పెద్ద పెద్ద దర్శకులు సైతం మునగపాకలో నాటక ప్రదర్శనలను దూరంగా కారులో ఉండి చూసిన సందర్భాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకుడు బొడ్డేడ ప్రసాద్, విల్లూరి పైడారావు, బుద్ధ శివాజీ, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

వెండితెరను తలపించిన ఛత్రపతి శివాజీ నాటక ప్రదర్శన

మునగపాకలో జయహో ఛత్రపతి శివాజీ మహారాజ్ నాటకం ప్రదర్శన వెండితెరను తలపించింది. స్థానిక నందీశ్వరప్రాంగణం తులసీ కళావేదికపై ఆదివారం రాత్రి విజయవాడకు చెందిన డాక్టర్ రామన్ ఫౌండేషన్ వారి శ్రీసాయిబాబా నాట్య మండలి కళాకారులు 'జయహో ఛత్రపతి శివాజీ మహారాజ్ నాటకం ప్రదర్శన జరిగింది. బాల శివాజీని దేశ భక్తునిగా తీర్చిదిద్దిన విధానం, గురువు సమర్థరామదాసు శిక్షణ వంటి అంశాలు ఆకట్టుకున్నాయి. పరాయి పాలకులను తరిమి కొట్టే యుద్ధ సన్నివేశాలు అబ్బురపరిచాయి. సంస్కార భారతి, సీబీఆర్ అకాడమీ ఆఫ్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ సంయుక్త నిర్వహణలో 60 మంది నటీనటులు, సాంకేతిక నిపుణులతో జరిగిన ప్రదర్శన అలరించింది.

డీఎస్సీలో ఉద్యోగం సాధించిన అంధురాలు

శంకరమ్మకు పాడేరు డివిజన్‌లో పోస్టింగ్.. దివ్యాంగుల పాఠశాల వ్యవస్థాపకుని ఆశీస్సులు తీసుకున్న శంకరమ్మ



పట్నాయక్ వద్ద ఆశీస్సులు తీసుకున్న అంధురాలు శంకరమ్మ

అచ్యుతాపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో కొండకర్లకు చెందిన అంధురాలు దాసరి శంకరమ్మ ఉపాధ్యాయురాలిగా ఎంపికైంది. ఆమెకు పాడేరు డివిజన్‌లో పోస్టింగ్ ఇచ్చారు. అయితే తనను ఒకటో తరగతి నుంచి చదివించి ఈ స్థాయికి తెచ్చిన దివ్యాంగ పాఠశాల వ్యవస్థాపకులు పీఎస్టీ పట్నాయక్ ఆశీస్సులు తీసుకోవడానికి ఆదివారం ఆమె ఇక్కడికి వచ్చారు. కొండకర్లకు చెందిన దాసరి వరలక్ష్మి, శంకరమ్మ అక్కచెల్లెళ్లు.. ఇద్దరూ అంధులే. వీరిరువురూ అచ్యుతాపురం మండల దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలలో చేరి పదో తరగతి వరకు చదివారు. అక్క వరలక్ష్మి మాత్రం చదువు ఆపేయగా శంకరమ్మ మాత్రం కొనసాగించింది. చదువుపై ఆమె ఉత్సాహాన్ని చూసి పట్నాయక్ అచ్యుత కళాశాలలో చేర్పించారు.

మండల దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలలో శంకరమ్మ ఉంటూ 2015-16 ఇంటర్ పూర్తిచేసింది. తర్వాత ఆనందపురం వద్ద గల నీలకుండీలు వద్ద గల టీటీసీలో శిక్షణ తీసుకొని 2018లో జరిగిన డీఎస్సీ రాసినా విజయం సాధించలేకపోయింది. అయినా పట్టువదలకుండా చదివి ఇటీవల జరిగిన డీఎస్సీలో విజయం సాధించి పాడేరు డివిజన్‌లో పోస్టింగ్ తెచ్చుకుంది.

అయితే తాను అంధురాలు అయినప్పటికీ తనను ప్రోత్సహించిన పీఎస్టీ పట్నాయక్ ఆశీస్సులను శంకరమ్మ తీసుకుంది. పట్టుదల ఉంటే అంగవైకల్యం దేనికీ అడ్డురాదని శంకరమ్మ నిరూపించిందని పీఎస్‌టీ పట్నాయక్ ఆమెను అభినందించారు.

ఆర్ఎస్ఎస్‌లో కోటి మంది స్వయం సేవకులు



ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవంలో పాల్గొన్న విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్, వక్తలు

పాయకరావుపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): దేశంలో వందేళ్ల క్రితం 17 మందితో ప్రారంభమైన రాష్ట్రీయ స్వయం సేవక్(ఆర్ఎస్ఎస్) ద్వారా కోటి మంది స్వయం సేవకులుగా తయారుచేయడం జరిగిందని ఆర్ఎస్ఎస్ ప్రతినిధి రెడ్డి నాగన్నదొర అన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక సిద్ధార్థ స్కూల్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ ఎంతో మంది దేశభక్తులు, ఉత్తమ నాయకులను తయారు చేసిందన్నారు. అనంతరం స్వయం సేవకులు దేశభక్తి గీతాలు ఆలపించడంతో పాటు శారీరక్, వ్యాయామ యోగ్ తదితర ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌వీబీఎస్.శాస్త్రి, వెలిశెట్టి వీరభద్రరావు, రాపర్తి సత్యనారాయణ, పక్కుర్తి నూకరాజు, పల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

సనాతన ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి హిందువుకి ఉందని జనసేన ఉత్తరాంధ్ర జిల్లాల రాజకీయ వ్యవహారాల ప్రతినిధి సుందరపు సతీష్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ప్రశాంతి విద్యాసంస్థల ఆవరణలో జరిగిన ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో సనాతన ధర్మం అత్యుత్తమమైనదన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులు కందాల పార్థసారథి, రాజాన సన్యాసినాయుడు, అగ్గాల హనుమంతరావు, కొరుప్రోలు చిన్నారావు, నాయుడుబాబు, కాసుబాబు, సీహెచ్ రాజు, పల్లి రాజుబాబు, జైశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో..

సామాజికాభివృద్ధిలో ఆర్ఎస్ఎస్ సేవలు మరువలేనివని, ఎటువంటి వైషమ్యాలు లేకుండా దేశాభివృద్ధికి కృషి చేస్తుందని విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. ఆదివారం ఎలమంచిలిలో నిర్వహించిన ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన మాట్లాడారు. పంచ పరివర్తన ద్వారా సమాజంలోని ప్రతి ఒక్కరినీ అభ్యుదయం వైపు తీసుకువెళ్లడమే లక్ష్యమన్నారు. ఆంధ్ర ప్రాంత ప్రచారక్ విజయ ఆదిత్య మాట్లాడుతూ కుటుంబాలతో కలిసి ఉండడం, స్వదేశీ వస్తువులను వినియోగించడం, పర్యావరణ పరిరక్షణ ద్వారా సమాజ హితాన్ని కోరడం సమరసత ద్వారా భేద భావాలు లేకుండా సమాజంలో జీవించడం వంటి పౌర నియమాలు గురించి వివరించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, స్వయం సేవకులు ఎమ్. సతీష్, సన్యాసిబాబు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మునగపాకలో..

మండలంలోని గణపర్తి తులసీ కల్యాణ మండపం ఆవరణలో రాష్ట్రీయ స్వయం సేవక్ శతాబ్ది ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా యోగాసనాలు గురించి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నాయకులు పార్థసారథి, ఎం.సతీష్, ద్వారపురెడ్డి వాసు, కర్రి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

టైలర్లకు గుర్తింపు తెచ్చింది కూటమి ప్రభుత్వమే

రాష్ట్ర టైలర్స్ అభివృద్ధి కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ స్వామి



ఆకాశపు స్వామికి వినతి పత్రం అందజేస్తున్న స్థానిక ప్రతినిధులు

ఎలమంచిలి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి):దేశంలోనే తొలిసారిగా టైలరింగ్ రంగాన్ని గుర్తించి ఫెడరేషన్ ఏర్పాటు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని రాష్ట్ర టైలర్స్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి అన్నారు. ఆదివారం పట్టణ టైలర్ల కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో టైలర్లను ఆదుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. త్వరలోనే బీసీ కార్పొరేషన్ ద్వారా మహిళలకు టైలరింగ్ శిక్షణ ఇచ్చి, వారికి ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేస్తామన్నారు. ఆదరణ పథకం ద్వారా టైలర్లకు పనిముట్లు అందజేస్తామన్నారు. టైలర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానన్నారు. అనంతరం సమస్యలపై స్థానిక టైలర్ల సంఘ ప్రతినిధులు ఆయనకు వినతి పత్రం అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు వియ్యపు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆడారి శ్రీధర్, న్యూ నవ్యాంధ్ర రాష్ట్ర టైలర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అతికినశెట్టి సత్యనారాయణ, న్యాయ సలహాదారులు టి. పుల్లయ్యనాయుడు, మళ్ల శ్రీనివాస్, పిల్లా శివ, డి.సూరిబాబు, కట్టా సత్యనారాయణ, వేగి విజయ, గిడుతూరి అప్పారావు, వి.సత్తిబాబు, కె.భద్రరావు పాల్గొన్నారు.

ఘనంగా నవగ్రహాలు, కాలభైరవస్వామి విగ్రహాల ప్రతిష్ఠ

రాంబిల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తూరు లోని కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నవగ్రహాలు, కాలభైరవ స్వామి విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి పూజలు చేశారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ నవగ్రహాలకు పూజలు చేశారు. అనంతరం విశ్వేశ్వరస్వామిని దర్శించారు. అనంతరం ఆలయ కమిటీ పెద్దలు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు వి.దిన్‌బాబు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర, కొత్తూరు, దిమిలి మాజీ సర్పంచులు ఎన్. సాయివరప్రసాద్, కొటాపు వడ్డీకాసులు, భక్తులు పాల్గొన్నారు.

గంగపుత్రుల కన్నెర్ర

... 5వ పేజీ తరువాయి

మూడు గంటల నుంచి మత్స్యకారులు ఆందోళన చేస్తుండడంతో అటు అన్నవరం, ఇటు తాళ్లపాలెం సమీపం వరకు దాదాపు 60 కి.మీ.ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా సాయంత్రం 5.45 గంటలకు నక్కపల్లి వచ్చారు. బల్క్‌డ్రగ్ పార్కు అనుమతులు రద్దు చేయాలని, ఈ విషయంలో ఆందోళన చేస్తున్న తమకు మద్దతు ఇచ్చే వారిని నిర్బంధించకూడదని, అక్రమ కేసులు ఎత్తివేయాలని, తమపట్ల దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు డిమాండ్ చేశారు. కలెక్టర్ ఎస్పీ మాట్లాడుతూ, నాలుగు గంటల నుంచి వాహనాలు ఆగిపోవడం వల్ల ప్రయాణికులు.. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, ఆందోళనను విరమించాలని కోరారు. పోలీసులకు సంబంధించి విచారణ చేసి తప్పని తేలితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 15వ తేదీన రాజయ్యపేట వచ్చి మత్స్యకారులందరితో సమావేశమై మాట్లాడతామని చెప్పారు. దీంతో మత్స్యకారులు ఆందోళన విరమించారు. సాయంత్రం ఆరు గంటల తరువాత వాహనాల రాకపోకలు పునరుద్ధరణ అయ్యాయి. వైసీపీ నేత వీసం రామకృష్ణ, సీపీఎం నేత ఎం.అప్పలరాజు, జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, తదితరులు మత్స్యకారులకు మద్దతుగా ఆందోళనలో పాల్గొన్నారు.

బీసీవై నేతను నిర్బంధించడమే కారణమా?

వాస్తవానికి బీసీవై పార్టీ నేత రామచంద్రయాదవ్ హైకోర్టు అనుమతితో ఆదివారం మధ్యాహ్నం రాజయ్యపేట రావాల్సి వుంది. అయితే ఎస్పీ అనుమతి ఇవ్వకపోవడంతో ఆయనను విశాఖలోని ఒక హోటల్‌లో పోలీసులు నిర్బంధించారు. ఈ విషయం తెలుసుకున్న మత్స్యకారులు ఆగ్రహం చెందారు. రాజయ్యపేట నుంచి మూకుమ్మడిగా బయలుదేరి నక్కపల్లి వచ్చారు. దారిలో పలుచోట్ల పోలీసులు అడ్డుకున్నా.. ఖాతరు చేయలేదు.

విశాఖే ఆర్థిక రాజధాని

... 5వ పేజీ తరువాయి

ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబులు నగరానికి వస్తే, అంతటి విపత్కర పరిస్థితుల్లోనూ వారికి చిరునవ్వుతో స్వాగతం పలికిన గొప్ప మనసున్న ప్రజలని ప్రశంసించారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలోని అనేక చోట్ల టీడీపీ నేతలు ఓడిపోతే విశాఖ నగర ప్రజలు టీడీపీకి పట్టం కట్టారన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారని, అప్పుడు కూడా తెల్లవారుజామున మూడు గంటలకు నిద్ర లేచి మూడు లక్షల మంది బీచ్‌కు తరలివచ్చారని గుర్తు చేశారు. విశాఖపట్నాన్ని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు రాజధానిగా చేస్తామన్నారు. ఐటీలో హైదరాబాద్ 30 ఏళ్లకు అభివృద్ధి సాధిస్తే.. అదే అభివృద్ధిని ఇక్కడ పదేళ్లలో సాధించాలని ధ్యేయంగా ముందుకు వెళుతున్నామన్నారు. కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ప్రభుత్వ విప్ పి.గణబాబు, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఏపీ కో-ఆపరేటివ్ గ్రోవర్స్ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ గండి బాబ్జీ, ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్టు వైస్‌చైర్మన్ సీతంరాజు సుధాకర్, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి జిల్లా కలెక్టర్లు స్వప్నిల్ దినకర్ పుండర్కర్, రామసుందరరెడ్డి, ఎంఎన్ హరేంధిరప్రసాద్, విజయకృష్ణన్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, విశాఖ జేసీ మయూర్ అశోక్, డీఆర్వో భవానీశంకర్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, వీఎంఆర్‌డీఏ సీయూపీ శిల్ప, అధికారులు పాల్గొన్నారు.

తీరానికి.. తాటి కవచం!

... 5వ పేజీ తరువాయి

కార్యాచరణ రూపొందించామని విశాఖ సర్కిల్ కన్జర్వేటర్ బీఎం దివాన్ మైదీన్ తెలిపారు. ఈ పథకం వల్ల పెరగనున్న తాటి, సరుగుడు వనాల ద్వారా తీర ప్రాంతానికి రక్షణ లభిస్తుందన్నారు. గతంలోనూ తీరం పొడవునా వీటిని పెంచారని, మరోసారి తాటి, సరుగుడు వనాలు పెంచడం ద్వారా తీర ప్రాంతం కోత, తుఫాన్‌లు సంభవించేటప్పుడు వీచే పెనుగాలుల నుంచి రక్షణ లభిస్తుందన్నారు.

ప్రతికా, స్మృతి పోరు వృథా!

... 5వ పేజీ తరువాయి

ఇన్నింగ్ ఆద్యంతం స్టేడియం కరతాళ ధ్వనులతో మర్మోగగా, దీటైన బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ ఆద్యంతం నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డేలో అనూహ్య ఓటమితో పాఠాలు నేర్చుకున్న భారత్ మహిళలు ఆ సారి మ్యాచ్‌లో ఇన్నింగ్స్ తొలి ఓవర్ నుంచి కంగారూలను బెంబేలెత్తించినా బౌలర్లు ఆశించిన స్థాయిలో రాణించలేకపోవడంతో ఓటమి పాలు కాక తప్పలేదు. ఆస్ట్రేలియా ఓపెనర్ అలిస్సా హిలి భారీ సెంచరీతో (142) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి తమ ఖాతాలో మరో విజయాన్ని నమోదు చేసింది. భారత్‌పై దక్షిణాఫ్రికా చివరిగా సిక్సర్ కొట్టి గెలుపొందగా..ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా సిక్సర్‌తోనే విజయం సాధించడం విశేషం.

చెలరేగిన స్మృతి మందాన, ప్రతికా రావల్

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ 49 ఓవర్లలో 330 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు ప్రతికా రావల్ (75), స్మృతి మందాన (80) చెలరేగారు. ఎనిమిదో ఓవర్లో సోఫీ బౌలింగ్‌లో స్మృతి మందాన స్క్వేర్ లెగ్ మీదుగా బౌండరీ, లాంగ్ ఆన్ మీదుగా సిక్సర్, మిడ్ వికెట్ మీదుగా మరో బౌండరీ బాది స్కోరు బోర్డును పరిగెత్తించింది. అదే ఓవర్లో స్క్వేర్ లెగ్ వద్ద అవుట్ నుంచి తప్పించుకుంది. తొమ్మిదో ఓవర్‌లో గార్డనర్ బౌలింగ్‌లో మరో ఓపెనర్ ప్రతికా రావాల్ లాంగ్ ఆన్ మీదుగా సిక్సర్, మిడాఫ్ మీదుగా బౌండరీ కొట్టి ఆసీస్ బౌలర్లను బెంబేలెత్తించింది. స్మృతి మందాన 46 బంతుల్లో 7 బౌండరీలు, ఒక సిక్సర్‌తో అర్ధసెంచరీ పూర్తి చేయగా...ప్రతికా రావల్ 69 బంతుల్లో 7 బౌండరీలు, ఒక సిక్సర్‌తో హాఫ్ సెంచరీ సాధించింది.

నాలుగు ఓవర్లలో ఐదు వికెట్లు

భారీ స్కోరు దిశగా సాగుతున్న భారత్ మహిళలు అనవసర షాట్‌లకు ప్రయత్నించి వికెట్లు పోగొట్టుకున్నారు. ఫలితంగా మరో ఏడు బంతులు మిగిలి ఉండగానే, 48.5 ఓవర్లకు ఆలౌటయ్యారు. వికెట్ల ముందు సెటిల్ అయిన కెప్టెన్ హర్మన్ ప్రీత్ (22), రోడ్రిగస్ (33), రిచా ఘోష్ (32) అనవసర షాట్‌లతో వికెట్లు సమర్పించుకున్నారు. నాలుగు ఓవర్లలో వరుసగా ఐదు వికెట్లు పోగొట్టుకోవడం ప్రేక్షకులను తీవ్ర నిరాశకు గురిచేసింది.

సెంచరీతో హిలి కెప్టెన్ ఇన్నింగ్స్

ఆస్ట్రేలియా ఓపెనర్ అలిస్సా హిలి సెంచరీతో (142) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి భారత్ ఆశలపై నీళ్లు చల్లింది. మరో ఓపెనర్ లిచ్ ఫీల్డ్ (40) రాణించడంతో 15 ఓవర్లలోనే వంద పరుగులు పూర్తిచేసిన ఆస్ట్రేలియా దీటైనా జవాబు ఇచ్చేలా దూసుకుపోయింది. లిచ్ ఫీల్డ్ స్థానంలో దిగిన పెర్నీ (47; రిటైర్డ్ హర్ట్) క్రీజులో ఉన్నంతసేపు భారత్ మ్యాచ్‌పై పట్టు సాధించలేకపోయింది. అలిస్సా హిలి 84 బంతుల్లో 15 ఫోర్లు, ఒక సిక్సర్‌తో సెంచరీ పూర్తిచేసి పటిష్ఠ స్థితికి చేర్చింది. తర్వాత వచ్చిన ఆసీస్ బ్యాటర్లను భారత్ బౌలర్లు కట్టడి చేయడంలో విఫలమయ్యారు. సెకెండ్ స్పెల్‌లో అమన్‌జోత్ కౌర్ అద్భుత బౌలింగ్‌తో ఆస్ట్రేలియా బ్యాటర్లపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. రిటైర్డ్ హర్ట్ అయిన పెర్రీ తిరిగి బ్యాటింగ్‌కు వచ్చి స్నేహ రానా బౌలింగ్‌లో లాంగ్ ఆన్ మీదుగా సిక్సర్ బాదడంతో ఆస్ట్రేలియా 49 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి విజయం సాధించింది.

గుంతలమయం.. స్టేషన్ రోడ్డు

▸▸ అడుగడుగున ఇదే దుస్థితి ▸▸ ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ▸▸ వర్షాలకు నీరు చేరుతుండడంతో మరింత దారుణం



గూడ్స్‌షెడ్డు వద్ద గొయ్యి



అనకాపల్లిలో రైల్వేస్టేషన్‌కు వెళ్లే నాయుళ్లవీధి రోడ్డు



భీమునిగుమ్మం స్కూల్ వద్ద...



నాయుళ్లవీధిలో...

అనకాపల్లి టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చోడవరం రోడ్డు నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి అస్తవ్యస్తంగా మారింది. అడుగడుగున గుంతలు పడడంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు కురిసినప్పుడు పరిస్థితి మరీదారుణంగా ఉంటుంది.

చోడవరం, మాడుగుల, అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రజలతో పాటు అనకాపల్లి మండల వాసులు రైల్వే స్టేషన్‌కు వచ్చే ప్రధాన మార్గం ఇది. నాయుళ్ల వీధి నుంచి రైల్వేస్టేషన్ ప్రధాన బుకింగ్ కౌంటర్‌కు వెళ్లే రోడ్డుకు మధ్యలో గోతులు పడటంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆయా గోతుల్లో నీరు చేరి నిలిచిపోయింది. దీంతో ఇది గుర్తించలేని పలువురు వాహనదారుల అవస్థలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి.

నాయుళ్లవీధి, లక్ష్మీదేవిపేటకు వెళ్లే జంక్షన్, గూడ్స్ షెడ్డు, భీమునిగుమ్మం ఉన్నత పాఠశాల, భీమునిగుమ్మం జంక్షన్‌లో రోడ్లు మరింత భయపెడుతున్నాయి. పూడ్చకపోతే వర్షాలకు నీరు వీటి విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ మార్గంలోనే ఎన్టీఆర్ మార్కెట్ యార్డుతో పాటు రాజకీయ పార్టీల కార్యాలయాలు, విద్యా సంస్థలు, హోటళ్లు తదితరాలు ఉన్నాయి. దీనికితోడు చోడవరం రోడ్డులోంచి విశాఖ, విజయనగరం ప్రాంతాలకు వెళ్లేందుకు అనకాపల్లి మెయిన్ రోడ్డుకు చేరాలంటే ఇదే దగ్గర మార్గం. ఇంతటి ప్రాధాన్యం గల రోడ్డును అధికారులు విస్మరించడం తగదని పలువురు వాపోతున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులను త్వరతగతిన చేపట్టి ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

నూకాంబికకు మొక్కులు, ముడుపులు

▸▸ ఉదయం నుంచి భక్తులతో కళకళలాడిన ఆలయం



బాలాలయంలో అమ్మవారు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అన కాపల్లి నూకాంబిక ఆలయం ఆదివారం భక్తులతో కళకళలాడింది. తెల్లవారు జామున అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దర్శన భాగ్యం కల్పించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తర లివచ్చి బాలాలయంలోని మాతను దర్శించుకున్నారు. ఆలయ ఆవరణతో పాటు పరిసరాల్లో కుటుంబాలతో విచ్చేసినవారు వంటలు వండకుని నైవేద్యంగా సమర్పించి ఆరంగించారు. అమ్మవారిని సినీ నటుడు గౌతమ్‌రాజ్ దర్శించుకోగా, మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందజేశారు.



దర్శనాల కోసం క్యూలో ఉన్న భక్తులు

బాల్య వివాహాలను నిరోధించడం అందరి బాధ్యత



జడ్పీహెచ్ స్కూల్‌లో మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ప్రభావతి

తుమ్మపాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలను నిరోధించడం అందరి బాధ్యతని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో పి.ప్రభావతి అన్నారు. బాలికల దినోత్సవం సందర్భంగా తుమ్మపాల జిల్లా పరిషత్ స్కూల్‌లో శనివారం సాయంత్రం విద్యార్థినులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడంతో పాటు పౌష్టి కాహారాన్ని తీసుకోవాలన్నారు. బాలికలు ఇతరుల నుంచి సమస్యలకు గురైతే హెల్ప్ లైన్ నంబర్లకు సమాచారాన్ని అందించాలని సూచించారు. ప్రధానంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం కిశోర బాలికలకు ఆటల పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ఏసీడీపీవో శశికళ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వాసవీ మాత ఆలయ వేడుకల విరాళ దాతలకు సత్కారం



దాతల సత్కారంలో రేజేటి రామాచార్యులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో శత జయంతి వేడుకల నిర్వహణకు విరాళాలు అందజేసి దాతలను ఆదివారం ఘనంగా సత్కరించారు. జాతీయ అవార్డు గ్రహీత రేజేటి రామాచార్యులు వీరిని సత్కరించి ఆశీర్వదించారు. సావనీర్ కమిటీ చైర్మన్ యిమ్మిడిశెట్టి చక్రపాణి రూపొందించిన అమ్మవారి వందేళ్ల చరిత్ర పుస్తకాన్ని రామాచార్యులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శతజయంతి ఉత్సవాల చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో-చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషకుమార్, ఆలయ కమిటీ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణ కుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినిపై అత్యాచారం : ఎస్ఎఫ్ఐ నిరసన



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన తెలియజేస్తున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ బెంగాల్‌లోని వైద్య కళాశాలలో విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు ఆదివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి విజయ్, సహాయ కార్యదర్శి గౌతమ్ మాట్లాడుతూ గత ఏడాది పశ్చిమ బెంగాల్‌లోని ఆసుపత్రిలో మెడికోపై అత్యాచారం, హత్య జరిగిన ఘటన మరువక ముందే అదే రాష్ట్రంలో మరో దారుణం చోటు చేసుకోవడం విచారకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని వారు డిమాండ్ చేశారు. ఫెడరేషన్ ప్రతినిధులు సత్యనారాయణ, వంశీకృష్ణ, సతీష్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ ద్వారా కషాయాల పిచికారీతో ప్రయోజనాలు



డ్రోన్ ద్వారా కషాయాల పిచికారీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తుమ్మపాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని రైతు సాధికార సంస్థ మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ సిరసపల్లి అప్పలరాజు అన్నారు. మామిడిపాలెంలో పలువురు రైతులకు ఆదివారం ఏర్పాటైన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో తయారు చేసిన కషాయాలను డ్రోన్ ద్వారా పిచికారీ చేయడం వల్ల ఎకరానికి రూ. 1500 ఆదా చేసుకోవచ్చునన్నారు. ప్రస్తుతం కూలీల కొరత ఉన్న నేపథ్యంలో డ్రోన్ పిచికారీ వ్యవస్థ రైతులకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. అనకాపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ వ్యవస్థను అమలు చేయనున్నామన్నారు. సర్పంచ్ పూడి పరదేశి నాయుడు, ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది మజ్జి సత్యారావు, విల్లూరి శ్రీనివాసరావు, మళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

ఉల్లాసంగా.. ఉత్సాహంగా 'హ్యాపీ సండే'



వేడుకకు హాజరైన విద్యార్థుల సత్కారంలో జడ్పీ చక్రవర్తి, తదితరులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రింగు రోడ్డులో నిర్వహించిన హ్యాపీ సండే కార్యక్రమం ఉల్లాసంగా ఉత్సాహంగా సాగింది. కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు ఏర్పాటైన ఈ వేడుకలకు వివిధ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు హాజరై సందడి చేశారు. క్లాసికల్ డ్యాన్స్, స్కిట్స్, కరాటే, స్కేటింగ్, క్రీడా పోటీల్లో ప్రతిభ చూపారు. ముఖ్యంగా 'డొక్కా సీతమ్మ' కార్యక్రమం హైలెట్‌గా నిలిచింది. విద్యార్థులకు హెడ్ రిబ్బన్లు, టోపీలు, టీషర్టులు అందజేశారు. విజేతలకు జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి బహుమతులు అందజేసి అభినందించారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ శోభాయాత్ర

▸▸ లంకెలపాలెం వద్ద ప్రారంభం ▸▸ పెద్ద సంఖ్యలో భక్తులు హాజరు



జెండా ఊపి శోభాయాత్రను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

లంకెలపాలెం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ శోభాయాత్రను ఆదివారం ఇక్కడ ఘనంగా నిర్వహించారు. తొలుత జాతీయ రహదారి లంకెలపాలెం కూడలిలో గల అభయాంజనేయ ఆలయంలో స్వామి వారికి పూజల అనంతరం కార్పొరేటర్ శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. గొన్నవానిపాలెం, ఇ-మర్రిపాలెం, ఫార్మాసిటీ పునరావాస కాలనీ, వినాయక నగర్, శ్రీరామ్‌నగర్, మంత్రిపాలెం, పెదముషిడివాడ, మడకపాలెం, మారే డపూడి, సాలాపువానిపాలెం, తాడి గ్రామాల మీదగా తిరిగి ఈ యాత్ర లంకెలపాలెం చేరుకుంది. దారిపొడవునా భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మాదాసు వాసు, పచ్చికోరు రమణమూర్తి, మడక రమేశ్‌నాయుడు, సాలాపు వెంకటఅప్పారావు, శ్రీనివాసరావులతో పాటు అధిక సంఖ్యలు భక్తులు పాల్గొన్నారు.

నటులకు నాటకరంగం పునాది

▸▸ ఆడిషన్స్ ప్రారంభోత్సవంలో 'కాప్' వ్యవస్థాపకుడు, హాస్యనటుడు గౌతంరాజు

▸▸ రెండు జిల్లాల నుంచి 140 మందికి పైగా కళాకారులు హాజరు



ఆడిషన్స్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న నటుడు గౌతంరాజు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : నాటకరంగం నటులకు పునాదిరాయి వంటిదని సినిమా యాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపకుడు (కాప్), ప్రముఖ సినీ హాస్యనటుడు భూపతిరాజు గౌతంరాజు అన్నారు. పట్టణంలోని గౌరీ గ్రంథాలయంలో ఆదివారం కాప్ సహకారంతో హాస్య కళా సమితి ఆధ్వర్యంలో కళాకారుల ఎంపికను ప్రారంభించి మాట్లాడారు. ఆడిషన్స్ కళాకారులకు మల్టీ విటమిన్ టాబ్లెట్లుగా ఉపయోగపడతాయన్నారు. కళా ప్రపంచంలో అద్భుతాలు సృష్టించాలనుకునే ప్రతి కళాకారులు ఆడిషన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నిరంతర సాధన, అంకితభావం, పట్టుదలతోనే గొప్ప కళాకారులుగా తయారవుతారన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల నుంచి 140 మందికి పైగా కళాకారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సినీ దర్శకులు ఆర్.వి.సుబ్రహ్మణ్యం (సుబ్బు), శరగడం చిన్నికృష్ణ, హాస్య కళాసమితి అధ్యక్షుడు విల్లూరి వీర సంతోష్, కార్యదర్శి బుద్ధ ప్రవీణ్‌కుమార్, ఎస్‌డీ గ్రూప్ అధినేత కాండ్రేగుల శ్రీరామ్, జగన్నాథ స్వామి ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ దాడి ఈశ్వరరావు, కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రేక్షకులను ఆద్యంతం అలరించిన సంగీత విభావరి

మధుర గళంతో మైమరపించిన ప్రదీప్‌కుమార్



పాటలు పాడుతున్న ప్రదీప్‌కుమార్

అనకాపల్లి టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రోటరీ కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి ఏర్పాటైన ప్రముఖ గాయకుడు ప్రదీప్‌కుమార్ సంగీత విభావరి ప్రేక్షకులను ఆద్యంతం ఆకట్టుకుంది. ఆడిటర్ సూరిబాబు, దొడ్డి బాబుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అలనాటి దిగ్గజ గాన గంధర్వుడు కిశోర్‌కుమార్ పాడిన సూపర్ డూపర్ హిట్ సాంగ్స్‌ను ప్రదీప్‌కుమార్ తన మధు గళంతో వినిపించి అందరి ప్రశంసలు అందుకున్నారు. జూలీ ఐ లవ్ యూ.., మేర దిల్ మే ఆజ్ క్యా హై.. వంటి పాటలు ఆహూతులను తన్మయత్వంలో ముంచెత్తాయి. ఈ కార్యక్రమంలో శ్రీధరాల సుధాకర్, కె.అచ్యుతరామయ్య, రిటైర్డ్ తహశీల్దార్ పి.వీరభద్రరావు, వయో వృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షులు గౌరీపతి, ప్రసాద్, విశ్రాంత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరానగర్‌లో సామాజిక భవనం ప్రారంభం



సామాజిక భవనం ప్రారంభోత్సవంలో కార్పొరేటర్ ముత్యాలనాయుడు

సబ్బవరం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి : జీవీఎంసీ 88వ వార్డు వెదుళ్లనరవలోని కొత్తూరు వద్ద గల ఇందిరానగర్‌లో నూతనంగా నిర్మించిన సామాజిక భవనాన్ని కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు పరిధిలో ఈ ఏడాదిలో సుమారు రూ.పది కోట్ల నుంచి పదిహేను కోట్ల వరకు వెచ్చించి సీసీ రోడ్లు, కాలువలు, సామాజిక భవనాలు, కల్వర్టులు నిర్మించామని చెప్పారు. వచ్చే ఏడాదిలోగా పెండింగ్‌లో ఉన్న పనులన్నీ పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఊరుకూటి శ్రీను, మాడిన నర్సింగరావు, నక్క ప్రసాద్, గండికోట వెంకీ, సర్వశిద్ధి రాజు, ఉరుకూటి శంకర్, రాజు, సన్యాసిరావు, జోగునాయుడు, బాలాజీ, లక్ష్మణరావు, గోవింద, టి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన జిల్లా టీడీపీ నేతలు



విశాఖ జిల్లా పర్యటనకు ఆదివారం విచ్చేసిన ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు జిల్లా టీడీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. విశాఖ ఎయిర్ పోర్టులో మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీలు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. - అనకాపల్లి టౌన్

గల్లంతైన మత్స్యకార యువకుడు మృతి

▸▸ ముత్యాలమ్మపాలెం తీరానికి కొట్టుకొచ్చిన మృతదేహం



అర్జిల్లి బంగార్రాజు (ఫైల్‌ఫొటో)

పరవాడ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : సముద్రంలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకార యువకుడు అర్జిల్లి బంగార్రాజు (18) మృతి చెందాడు. శనివారం వేకువజామున ఆరు గురు మత్స్యకారులతో కలిసి బోటు ద్వారా ముత్యాలమ్మపాలెం వద్ద సముద్రంపై చేపల వేటకు వెళ్లిన క్ర మంలో అలల తాకిడికి సముద్రంలో జారిపడి బం గార్రాజు గల్లంతైన విషయం తెలిసిందే. ఈ విషయం తెలిసిన వెంటనే తోటి మత్స్యకారులు మూడు తెప్పల సహాయంతో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. చివరకు సదరు యువకుడి మృతదేహం ఆదివారం తెల్లవారుజామున ముత్యాలమ్మపాలెం తీరానికి కొట్టుకొచ్చింది. బంగార్రాజు పదో తరగతి వరకు చదువుకున్నాడు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు ఎస్ఐ కృష్ణారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి- తాడి రైల్వే స్టేషన్‌ల మధ్య రైలు నుంచి ఆదివారం జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్టు జీఆర్పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి తెలిపారు. తలకు, ఇతర శరీర భాగాలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందినట్టు చెప్పారు. మృతుడు సుమారు 5.3 అడుగుల ఎత్తు, నలుపురంగు జుత్తు కలిగి ఉన్నాడన్నారు. బ్లాక్ నెక్ ఆఫ్ హ్యాండ్స్ టీషర్టు, బ్లాక్ కలర్ ఫుల్‌ప్యాంట్ ధరించి ఉన్నట్టు చెప్పారు. వయస్సు 30 నుంచి 35 ఏళ్లు ఉంటుందని వివరించారు. అయితే అతని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతుడు ప్యాంట్ జేబులో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఏటీఎం ఉందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. వివరాలు తెలిసిన వారు 73820 58996 సెల్ ఫోన్ నంబరుకు తెలపాల్సిందిగా ఆమె కోరారు.

శ్రీరాంపురం యువతి కిడ్నాప్

▸▸ కాకినాడ జిల్లా చేబ్రోలులో కాపాడిన పోలీసులు

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలో యువతిని కిడ్నాప్ చేసి వివిధ ప్రాంతాల్లో కారులో తిప్పి కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో బెదిరిస్తుండగా పోలీసులు యువతిని, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన యువతి కర్రి వంశీ, మహమ్మద్ అల్తాఫ్ అనే ఇద్దరు వ్యక్తులను ప్రేమించింది. దీనిపై వారి మధ్య వివాదం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈనెల 11వ తేదీ ఉదయం పదకొండు గంటల సమయంలో అల్తాఫ్ సదరు యువతిని రాజానగరం బీచ్ వద్దకు తీసుకువెళ్లారు. అక్కడి నుంచి అల్తాఫ్, వంశీ, వంశీ స్నేహితుడు రాజు ఆమెను బలవంతంగా కారులో ఎక్కించుకుని వివిధ ప్రాంతాల మీదుగా తిప్పుతూ అన్నవరం, కత్తిపూడి మీదుగా చేబ్రోలు శివారులోని మట్టిరోడ్డులోకి తీసుకెళ్లారు. ఎవరో ఒకరిని తేల్చుకోవాలంటూ యువతిని వారు కొట్టి బెదిరించారు. మళ్లీ సాంబ అనే మరో వ్యక్తితో యువతిని బెదిరించడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని యువతిని, బెదిరించిన వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. యువతి ఫిర్యాదుపై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్టు గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



కబడ్డీ పోటీల వాల్‌పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మునగపాక మండలం వాడ్రాపల్లిలో ఈనెల 23, 24 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీపోటీల వాల్‌పోస్టర్‌ని అచ్యుతాపురంలో గల తన స్వగృహంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆదివారం ఆవిష్కరించారు. గౌరీ పరమేశ్వరుల మహోత్సవం సందర్భంగా గౌరీ యూత్, వీ రాంజనేయ యూత్ సంయుక్తంగా గ్రామంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈకార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కంటి, హోమియో వైద్య శిబిరానికి విశేష స్పందన

మునగపాక, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మునగపాకలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి, హోమియో వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గణేష్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరంలో 138 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా.. వారిలో 22 మందిని ఆపరేషన్‌కు గుర్తించారు. 50 మందికి పైగా హోమియో వైద్య సేవలు పొందారు. వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. శంకర్ ఫౌండేషన్ కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్ అవసరమైన వారిని బస్సులో విశాఖ తరలించారు. ఈ శిబిరంలో హోమియో వైద్యులు కాండ్రేగుల తులసి, దాడి హేమాన్విత, నిర్వాహకులు దాడి శ్రీరామ్మూర్తి, దాడి సాంబ, టెక్కలి దేవకీ పాల్గొన్నారు.

జనరాజదాస్‌కు టీడీపీ నేత నివాళి

మునగపాక, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్ఈసీఎస్ మాజీ ఛైర్మన్, ఉమ్మడి విశాఖ జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు స్వర్గీయ పెంటకోట జనరాజదాస్ చిత్రపటానికి టీడీపీ శ్రేణులు నివాళులర్పించారు. ఆదివారం నాగులాపల్లిలో జనరాజదాస్ 67వ జయంతి వేడుకలు టీడీపీ నాయకుడు దొడ్డి శ్రీను ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా ఆయన పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీచర్ కుటుంబానికి పీఆర్‌టీయూ ఆర్థిక సాయం

ఎస్.రాయవరం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వాకపాడు స్కూల్ ఉపాధ్యాయుడు వంకల సత్యం కుటుంబానికి మండల పీఆర్‌టీయూ బృందం చేయూతగా నిలిచింది. మండల పీఆర్‌టీయూ బృందం సమకూర్చిన రూ.1,02,000 నగదును ఆదివారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు సత్యం కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

చెర్లోపాలెంలో పారిశుధ్య పనులు

మునగపాక, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో చెర్లోపాలెం శివారు గవరవీధిలో పారిశుధ్య పనులు ఆదివారం మొదలయ్యాయి. 'చెర్లోపాలెం శివారులో కలుషిత నీరు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై పంచాయతీ పాలకవర్గం స్పందించింది. తాగునీటి కొళాయి వద్ద శుభ్రం చేశారు. తాగునీరు కలుషితం కాకుండా మరోచోట కుళాయి ఏర్పాటు చేస్తామని ఉప సర్పంచ్ బోజా శ్రీనివాసరావు, అప్పికొండ సత్తిబాబు తెలిపారు. రహదారిలో పిచ్చి తుప్పలను కూడా తొలగిస్తున్నామన్నారు. సమస్యలు తలెత్తకుండా పక్కా పనులు చేయమని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సూచించారన్నారు.

'రైతుకు నష్టపరిహారం ఇవ్వకుండా రోడ్డు వేయడం అన్యాయం'

రాంబిల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి):పూర్తిస్థాయిలో నష్టపరిహారం ఇవ్వకుండా రైతు సాగులో ఉన్న భూమిలో సిరిమాన్ కెమికల్ కంపెనీ కోసం రోడ్డు వేస్తుండడం అన్యాయమని ఎస్ఈజెడ్ నిర్వాసితుల సంఘం నాయకుడు జి.దేముడునాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని లాలంకోడూరు పంచాయతీ శివారు చాటమెట్టలోని రైతు లాలం అప్పలనాయుడుతో కలిసి రోడ్డు పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా దేముడునాయుడు మాట్లాడుతూ రైతు అప్పలనాయుడు పంట భూమికి పూర్తిస్థాయిలో నష్ట పరిహారం ఇవ్వకుండా రోడ్డు వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నేతలు వై.రాము, సీహెచ్ ఎల్లనాయుడు,కాసుబాబు పాల్గొన్నారు.

మరిడితల్లి ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

మునగపాక, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తోటాడ-గవర్ల అనకాపల్లి గ్రామస్థులు నిర్మిస్తున్న మరిడితల్లి ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళాన్ని తోటాడకు చెందిన స్వర్గీయ బుద్ధ పశుపతిరావు జ్ఞాపకార్థం అతని భార్య వరలక్ష్మి, కుమారుడు పురోగామి అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులుగా కలుసుకున్న పూర్వ విద్యార్థులు



శ్రీప్రకాష్ విద్యా సంస్థలో గ్రూపు ఫొటో దిగిన పూర్వ విద్యార్థులు

పాయకరావుపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ నందు 1997-98లో బీఈడీ చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశానికి కుటుంబ సభ్యులతోసహా వచ్చిన పూర్వ విద్యార్థులు ఒకరినొకరు పలకరించుకుని సందడి చేశారు. వీరిలో అత్యధికులు ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు హెచ్‌ఎంలుగా, ఉపాధ్యాయులుగా పిల్లలకు పాఠాలు చెప్పేవారుకాగా 28 సంవత్సరాల తరువాత కలుసుకుని అలనాటి తీపి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకొని ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే.నరసింహారావు మాట్లాడుతూ సమాజ హితమే ఉపాధ్యాయుల ప్రథమ లక్ష్యమన్నారు. విద్యార్థులకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.

టాలెంట్ టెస్ట్‌కు 700 మంది హాజరు

ఎలమంచిలి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏబీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని ట్రస్ట్ ఛైర్మన్ ఎంఎస్. స్వరూప్ అన్నారు. ఆదివారం స్థానిక వాగ్దేవి కళాశాల ఆవరణలో విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టాలెంట్ టెస్టుకు 700 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఈనెల 22వ తేదీన ఎలమంచిలిలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. టాలెంట్ టెస్ట్ విజేతలకు నగదు, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏబీ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తుట్టా నాగశ్రీను, అప్పలరాజు, అప్పలశెట్టి, దుర్గాప్రసాద్, రామ్‌కుమార్, కళాశాల ప్రతినిధి శేషగిరిరావు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం : సుందరపు

రాంబిల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో యువతను భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశంతోనే నేను-నా యువత కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ఎమ్మెల్యే విజయకుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని వెంకటాపురం జనసేన పార్టీ కార్యాలయంలో నేను-నా యువత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో ఎంతో మేధా సంపత్తి దాగి ఉందని, వారి అభిప్రాయాలను పంచుకోవడం ద్వారా మరింత అభివృద్ధి జరగడానికి అవకాశం ఉంటుందన్నారు.

ట్రాఫిక్ జామ్‌తో ప్రయాణికుల అవస్థలు

తాండవ జంక్షన్ వద్ద నిలిచిన నిలుపుదల... పాయకరావుపేట నుంచి వెనుదిరిగిన బీసీవై అధినేత రామచంద్రయాదవ్



బస్సులు ఆగిపోవడంతో నడిచివెళుతున్న ప్రయాణికులు



రాజమండ్రికి తిరిగి వెళ్లిపోతున్న బీసీవై అధినేత రామచంద్రయాదవ్

పాయకరావుపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటుకు వ్యతిరేకంగా నక్కపల్లి జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టిన నేపథ్యంలో వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. బస్సులు, వ్యాన్లు, కార్లలో ఉన్న వారు ఇబ్బందులు పడ్డారు. తాగేందుకు నీరు దొరక్క ఇబ్బంది పడ్డారు. రాజమండ్రి నుంచి విశాఖ వైపు వెళుతున్న వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోతుండడంతో పోలీసులు తాండం జంక్షన్ వద్ద వాహనాలు నిలిపివేశారు. అలాగే పలు వాహనాలను నర్సీపట్నం, మాకవరపాలెం, తాళ్లపాలెం మీదుగా జాతీయ రహదారిపైకి మళ్లించారు. సీఐ జి.అప్పన్న ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు కష్టపడాల్సి వచ్చింది. ట్రాఫిక్ జామ్ కావడంతో మత్స్యకారులకు మద్దతు పలికేందుకు ఆదివారం సాయంత్రం రాజమండ్రి నుంచి రోడ్డు మార్గం ద్వారా వచ్చిన బీసీవై అధినేత రామచంద్రయాదవ్ పాయకరావుపేట నుంచి వెనుదిరిగారు.

ఎస్.రాయవరంలో..

నక్కపల్లి వద్ద మత్స్యకారులు జాతీయ రహదారిపై ఆందోళన చేయడంతో ట్రాఫిక్‌జామ్‌లో నిలిచిపోయిన బస్సుల్లో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. బస్సుల్లో ప్రయాణికులు వారి గమ్య స్థానాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఎలమంచిలిలో..

నక్కపల్లి వద్ద రాజయ్యపేట మత్స్యకారులు నిరసన తెలపడంతో హైవేపై గంటల తరబడి వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు. రేగుపాలెం జంక్షన్ వద్ద రూరల్ ఎస్ఐ ఉపేంద్ర తన సిబ్బందితో వాహనాల రాకపోకలను దారి మళ్లించే చర్యలు తీసుకున్నారు. ఎట్టకేలకు సాయంత్రం 6 గంటలు దాటిన వాహనాలు రాకపోకలు ప్రారంభమయ్యాయి.

నట శిఖరం లంక సత్యానంద్ : దాడి



లంక సత్యానంద్‌ను సత్కరించిన మాజీమంత్రి దాడి వీరభద్రరావు, తదితరులు



ఛత్రపతి శివాజీ మహారాజ్ నాటకం ప్రదర్శన

మునగపాక, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సినీ, నాటక రంగంలో స్టార్ మేకర్ లంక సత్యానంద్ నట శిఖరం అని చెప్పకతప్పదని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు కొనియాడారు. ఆదివారం ఉమ్మడి విశాఖ జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు స్వర్గీయ పెంటకోట జనరాజదాస్ 67వ జయంతి వేడుకల్లో భాగంగా స్థానిక నందీశ్వర ప్రాంగణం తులసీ కళావేదికపై జరిగిన కార్యక్రమంలో స్టార్ మేకర్ లంక సత్యానంద్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దాడి వీరభద్రరావు మాట్లాడుతూ సత్యానంద్ నాటక రంగానికి ఎనలేని సేవలు అందించారన్నారు. సత్యానంద్ రూపొందించిన బొమ్మలాట 102 రోజులు టిక్కెట్ ప్రదర్శన జరిగి దేశవ్యాప్తంగా గుర్తింపును సొంతం చేసుకుందన్నారు. దశాబ్దాలు క్రితం ఆయన రూపొందించిన బొమ్మలాటలో పాత్రలు నేటి రాజకీయరంగంలో దర్శనమిస్తోందన్నారు. లీడర్ పత్రిక అధినేత వీవీ.రమణమూర్తి మాట్లాడుతూ జిల్లాలో మునగపాక గ్రామం నాటకరంగాన్ని గుండెల్లో పెట్టుకొని ఆరాధిస్తుందని చెప్పడం అతిశయోక్తి అనిపించుకోదన్నారు. స్టార్ మేకర్ లంక సత్యానంద్ మాట్లాడుతూ బాల నటుడుగా మునగపాక వేదికపై 1969లో వేసిన నాటకంలో పాత్ర ద్వారా తొలి ప్రశంసాపత్రం అందుకున్నానని తెలిపారు. పవన్ కల్యాణ్, ప్రభాష్ వంటి నటులే కాకుండా పెద్ద పెద్ద దర్శకులు సైతం మునగపాకలో నాటక ప్రదర్శనలను దూరంగా కారులో ఉండి చూసిన సందర్భాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకుడు బొడ్డేడ ప్రసాద్, విల్లూరి పైడారావు, బుద్ధ శివాజీ, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

వెండితెరను తలపించిన ఛత్రపతి శివాజీ నాటక ప్రదర్శన

మునగపాకలో జయహో ఛత్రపతి శివాజీ మహారాజ్ నాటకం ప్రదర్శన వెండితెరను తలపించింది. స్థానిక నందీశ్వరప్రాంగణం తులసీ కళావేదికపై ఆదివారం రాత్రి విజయవాడకు చెందిన డాక్టర్ రామన్ ఫౌండేషన్ వారి శ్రీసాయిబాబా నాట్య మండలి కళాకారులు 'జయహో ఛత్రపతి శివాజీ మహారాజ్' నాటకం ప్రదర్శన జరిగింది. బాల శివాజీని దేశ భక్తునిగా తీర్చిదిద్దిన విధానం, గురువు సమర్థరామదాసు శిక్షణ వంటి అంశాలు ఆకట్టుకున్నాయి. పరాయి పాలకులను తరిమి కొట్టే యుద్ధ సన్నివేశాలు అబ్బురపరిచాయి. సంస్కార భారతి, సీబీఆర్ అకాడమీ ఆఫ్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ సంయుక్త నిర్వహణలో 60 మంది నటీనటులు, సాంకేతిక నిపుణులతో జరిగిన ప్రదర్శన అలరించింది.

డీఎస్సీలో ఉద్యోగం సాధించిన అంధురాలు

శంకరమ్మకు పాడేరు డివిజన్‌లో పోస్టింగ్.. దివ్యాంగుల పాఠశాల వ్యవస్థాపకుని ఆశీస్సులు తీసుకున్న శంకరమ్మ



పట్నాయక్ వద్ద ఆశీస్సులు తీసుకున్న అంధురాలు శంకరమ్మ

అచ్యుతాపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో కొండకర్లకు చెందిన అంధురాలు దాసరి శంకరమ్మ ఉపాధ్యాయురాలిగా ఎంపికైంది. ఆమెకు పాడేరు డివిజన్‌లో పోస్టింగ్ ఇచ్చారు. అయితే తనను ఒకటో తరగతి నుంచి చదివించి ఈ స్థాయికి తెచ్చిన దివ్యాంగ పాఠశాల వ్యవస్థాపకులు పీఎస్టీ పట్నాయక్ ఆశీస్సులు తీసుకోవడానికి ఆదివారం ఆమె ఇక్కడికి వచ్చారు. కొండకర్లకు చెందిన దాసరి వరలక్ష్మి, శంకరమ్మ అక్కచెల్లెళ్లు.. ఇద్దరూ అంధులే. వీరిరువురూ అచ్యుతాపురం మండల దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలలో చేరి పదో తరగతి వరకు చదివారు. అక్క వరలక్ష్మి మాత్రం చదువు ఆపేయగా శంకరమ్మ మాత్రం కొనసాగించింది. చదువుపై ఆమె ఉత్సాహాన్ని చూసి పట్నాయక్ అచ్యుత కళాశాలలో చేర్పించారు.

మండల దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలలో శంకరమ్మ ఉంటూ 2015-16 ఇంటర్ పూర్తిచేసింది. తర్వాత ఆనందపురం వద్ద గల నీలకుండీలు వద్ద గల టీటీసీలో శిక్షణ తీసుకొని 2018లో జరిగిన డీఎస్సీ రాసినా విజయం సాధించలేకపోయింది. అయినా పట్టువదలకుండా చదివి ఇటీవల జరిగిన డీఎస్సీలో విజయం సాధించి పాడేరు డివిజన్‌లో పోస్టింగ్ తెచ్చుకుంది.

అయితే తాను అంధురాలు అయినప్పటికీ తనను ప్రోత్సహించిన పీఎస్టీ పట్నాయక్ ఆశీస్సులను శంకరమ్మ తీసుకుంది. పట్టుదల ఉంటే అంగవైకల్యం దేనికీ అడ్డురాదని శంకరమ్మ నిరూపించిందని పీఎస్‌టీ పట్నాయక్ ఆమెను అభినందించారు.

ఆర్ఎస్ఎస్‌లో కోటి మంది స్వయం సేవకులు



ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవంలో పాల్గొన్న విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనంద్, వక్తలు

పాయకరావుపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): దేశంలో వందేళ్ల క్రితం 17 మందితో ప్రారంభమైన రాష్ట్రీయ స్వయం సేవక్(ఆర్ఎస్ఎస్) ద్వారా కోటి మంది స్వయం సేవకులుగా తయారుచేయడం జరిగిందని ఆర్ఎస్ఎస్ ప్రతినిధి రెడ్డి నాగన్నదొర అన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక సిద్ధార్థ స్కూల్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ ఎంతో మంది దేశభక్తులు, ఉత్తమ నాయకులను తయారు చేసిందన్నారు. అనంతరం స్వయం సేవకులు దేశభక్తి గీతాలు ఆలపించడంతో పాటు శారీరక్, వ్యాయామ యోగ్ తదితర ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌వీబీఎస్.శాస్త్రి, వెలిశెట్టి వీరభద్రరావు, రాపర్తి సత్యనారాయణ, పక్కుర్తి నూకరాజు, పల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

సనాతన ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి హిందువుకి ఉందని జనసేన ఉత్తరాంధ్ర జిల్లాల రాజకీయ వ్యవహారాల ప్రతినిధి సుందరపు సతీష్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ప్రశాంతి విద్యాసంస్థల ఆవరణలో జరిగిన ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో సనాతన ధర్మం అత్యుత్తమమైనదన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులు కందాల పార్థసారథి, రాజాన సన్యాసినాయుడు, అగ్గాల హనుమంతరావు, కొరుప్రోలు చిన్నారావు, నాయుడుబాబు, కాసుబాబు, సీహెచ్ రాజు, పల్లి రాజుబాబు, జైశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో..

సామాజికాభివృద్ధిలో ఆర్ఎస్ఎస్ సేవలు మరువలేనివని, ఎటువంటి వైషమ్యాలు లేకుండా దేశాభివృద్ధికి కృషి చేస్తుందని విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. ఆదివారం ఎలమంచిలిలో నిర్వహించిన ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన మాట్లాడారు. పంచ పరివర్తన ద్వారా సమాజంలోని ప్రతి ఒక్కరినీ అభ్యుదయం వైపు తీసుకువెళ్లడమే లక్ష్యమన్నారు. ఆంధ్ర ప్రాంత ప్రచారక్ విజయ ఆదిత్య మాట్లాడుతూ కుటుంబాలతో కలిసి ఉండడం, స్వదేశీ వస్తువులను వినియోగించడం, పర్యావరణ పరిరక్షణ ద్వారా సమాజ హితాన్ని కోరడం సమరసత ద్వారా భేద భావాలు లేకుండా సమాజంలో జీవించడం వంటి పౌర నియమాలు గురించి వివరించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి, స్వయం సేవకులు ఎమ్. సతీష్, సన్యాసిబాబు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మునగపాకలో..

మండలంలోని గణపర్తి తులసీ కల్యాణ మండపం ఆవరణలో రాష్ట్రీయ స్వయం సేవక్ శతాబ్ది ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా యోగాసనాలు గురించి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నాయకులు పార్థసారథి, ఎం.సతీష్, ద్వారపురెడ్డి వాసు, కర్రి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

టైలర్లకు గుర్తింపు తెచ్చింది కూటమి ప్రభుత్వమే

రాష్ట్ర టైలర్స్ అభివృద్ధి కోఆపరేటివ్ ఫెడరేషన్ ఛైర్మన్ స్వామి



ఆకాశపు స్వామికి వినతి పత్రం అందజేస్తున్న స్థానిక ప్రతినిధులు

ఎలమంచిలి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి):దేశంలోనే తొలిసారిగా టైలరింగ్ రంగాన్ని గుర్తించి ఫెడరేషన్ ఏర్పాటు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని రాష్ట్ర టైలర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ ఆకాశపు స్వామి అన్నారు. ఆదివారం పట్టణ టైలర్ల కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో టైలర్లను ఆదుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. త్వరలోనే బీసీ కార్పొరేషన్ ద్వారా మహిళలకు టైలరింగ్ శిక్షణ ఇచ్చి, వారికి ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేస్తామన్నారు. ఆదరణ పథకం ద్వారా టైలర్లకు పనిముట్లు అందజేస్తామన్నారు. టైలర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానన్నారు. అనంతరం సమస్యలపై స్థానిక టైలర్ల సంఘ ప్రతినిధులు ఆయనకు వినతి పత్రం అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు వియ్యపు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆడారి శ్రీధర్, న్యూ నవ్యాంధ్ర రాష్ట్ర టైలర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అతికినశెట్టి సత్యనారాయణ, న్యాయ సలహాదారులు టి. పుల్లయ్య నాయుడు, మళ్ల శ్రీనివాస్, పిల్లా శివ, డి.సూరిబాబు, కట్టా సత్యనారాయణ, వేగి విజయ, గిడుతూరి అప్పారావు, వి.సత్తిబాబు, కె.భద్రరావు పాల్గొన్నారు.

ఘనంగా నవగ్రహాలు, కాలభైరవస్వామి విగ్రహాల ప్రతిష్ఠ

రాంబిల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తూరు లోని కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నవగ్రహాలు, కాలభైరవ స్వామి విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి పూజలు చేశారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ నవగ్రహాలకు పూజలు చేశారు. అనంతరం విశ్వేశ్వరస్వామిని దర్శించారు. అనంతరం ఆలయ కమిటీ పెద్దలు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు వి.దిన్‌బాబు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర, కొత్తూరు, దిమిలి మాజీ సర్పంచులు ఎన్. సాయివరప్రసాద్, కొటాపు వడ్డీకాసులు, భక్తులు పాల్గొన్నారు.

గంగపుత్రుల కన్నెర్ర

... 5వ పేజీ తరువాయి

మూడు గంటల నుంచి మత్స్యకారులు ఆందోళన చేస్తుండడంతో అటు అన్నవరం, ఇటు తాళ్లపాలెం సమీపం వరకు దాదాపు 60 కి.మీ.ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా సాయంత్రం 5.45 గంటలకు నక్కపల్లి వచ్చారు. బల్క్‌డ్రగ్ పార్కు అనుమతులు రద్దు చేయాలని, ఈ విషయంలో ఆందోళన చేస్తున్న తమకు మద్దతు ఇచ్చే వారిని నిర్బంధించకూడదని, అక్రమ కేసులు ఎత్తివేయాలని, తమపట్ల దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు డిమాండ్ చేశారు. కలెక్టర్ ఎస్పీ మాట్లాడుతూ, నాలుగు గంటల నుంచి వాహనాలు ఆగిపోవడం వల్ల ప్రయాణికులు.. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, ఆందోళనను విరమించాలని కోరారు. పోలీసులకు సంబంధించి విచారణ చేసి తప్పని తేలితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 15వ తేదీన రాజయ్యపేట వచ్చి మత్స్యకారులందరితో సమావేశమై మాట్లాడతామని చెప్పారు. దీంతో మత్స్యకారులు ఆందోళన విరమించారు. సాయంత్రం ఆరు గంటల తరువాత వాహనాల రాకపోకలు పునరుద్ధరణ అయ్యాయి. వైసీపీ నేత వీసం రామకృష్ణ, సీపీఎం నేత ఎం.అప్పలరాజు, జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, తదితరులు మత్స్యకారులకు మద్దతుగా ఆందోళనలో పాల్గొన్నారు.

బీసీవై నేతను నిర్బంధించడమే కారణమా?

వాస్తవానికి బీసీవై పార్టీ నేత రామచంద్రయాదవ్ హైకోర్టు అనుమతితో ఆదివారం మధ్యాహ్నం రాజయ్యపేట రావాల్సి వుంది. అయితే ఎస్పీ అనుమతి ఇవ్వకపోవడంతో ఆయనను విశాఖలోని ఒక హోటల్‌లో పోలీసులు నిర్బంధించారు. ఈ విషయం తెలుసుకున్న మత్స్యకారులు ఆగ్రహం చెందారు. రాజయ్యపేట నుంచి మూకుమ్మడిగా బయలుదేరి నక్కపల్లి వచ్చారు. దారిలో పలుచోట్ల పోలీసులు అడ్డుకున్నా.. ఖాతరు చేయలేదు.

విశాఖే ఆర్థిక రాజధాని

... 5వ పేజీ తరువాయి

ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబులు నగరానికి వస్తే, అంతటి విపత్కర పరిస్థితుల్లోనూ వారికి చిరునవ్వుతో స్వాగతం పలికిన గొప్ప మనసున్న ప్రజలని ప్రశంసించారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలోని అనేక చోట్ల టీడీపీ నేతలు ఓడిపోతే విశాఖ నగర ప్రజలు టీడీపీకి పట్టం కట్టారన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారని, అప్పుడు కూడా తెల్లవారుజామున మూడు గంటలకు నిద్ర లేచి మూడు లక్షల మంది బీచ్‌కు తరలివచ్చారని గుర్తు చేశారు. విశాఖపట్నాన్ని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు రాజధానిగా చేస్తామన్నారు. ఐటీలో హైదరాబాద్ 30 ఏళ్లకు అభివృద్ధి సాధిస్తే.. అదే అభివృద్ధిని ఇక్కడ పదేళ్లలో సాధించాలని ధ్యేయంగా ముందుకు వెళుతున్నామన్నారు. కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ప్రభుత్వ విప్ పి.గణబాబు, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఏపీ కో-ఆపరేటివ్ గ్రోవర్స్ ఆయిల్‌ఫెడ్ ఛైర్మన్ గండి బాబ్జీ, ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్టు వైస్‌ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి జిల్లా కలెక్టర్లు స్వప్నిల్ దినకర్ పుండర్కర్, రామసుందరరెడ్డి, ఎంఎన్ హరేంధిరప్రసాద్, విజయకృష్ణన్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, విశాఖ జేసీ మయూర్ అశోక్, డీఆర్వో భవానీశంకర్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, వీఎంఆర్‌డీఏ సీయూపీ శిల్ప, అధికారులు పాల్గొన్నారు.

తీరానికి.. తాటి కవచం!

... 5వ పేజీ తరువాయి

కార్యాచరణ రూపొందించామని విశాఖ సర్కిల్ కన్జర్వేటర్ బీఎం దివాన్ మైదీన్ తెలిపారు. ఈ పథకం వల్ల పెరగనున్న తాటి, సరుగుడు వనాల ద్వారా తీర ప్రాంతానికి రక్షణ లభిస్తుందన్నారు. గతంలోనూ తీరం పొడవునా వీటిని పెంచారని, మరోసారి తాటి, సరుగుడు వనాలు పెంచడం ద్వారా తీర ప్రాంతం కోత, తుఫాన్‌లు సంభవించేటప్పుడు వీచే పెనుగాలుల నుంచి రక్షణ లభిస్తుందన్నారు.

ప్రతికా, స్మృతి పోరు వృథా!

... 5వ పేజీ తరువాయి

ఇన్నింగ్ ఆద్యంతం స్టేడియం కరతాళ ధ్వనులతో మార్మోగగా, దీటైన బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ ఆద్యంతం నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డేలో అనూహ్య ఓటమితో పాఠాలు నేర్చుకున్న భారత్ మహిళలు ఆ సారి మ్యాచ్‌లో ఇన్నింగ్స్ తొలి ఓవర్ నుంచి కంగారూలను బెంబేలెత్తించినా బౌలర్లు ఆశించిన స్థాయిలో రాణించలేకపోవడంతో ఓటమి పాలు కాక తప్పలేదు. ఆస్ట్రేలియా ఓపెనర్ అలిస్సా హీలి భారీ సెంచరీతో (142) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి తమ ఖాతాలో మరో విజయాన్ని నమోదు చేసింది. భారత్‌పై దక్షిణాఫ్రికా చివరిగా సిక్సర్ కొట్టి గెలుపొందగా..ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా సిక్సర్‌తోనే విజయం సాధించడం విశేషం.

చెలరేగిన స్మృతి మందాన, ప్రతికా రావల్

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ 49 ఓవర్లలో 330 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు ప్రతికా రావల్ (75), స్మృతి మందాన (80) చెలరేగారు. ఎనిమిదో ఓవర్లో సోఫీ బౌలింగ్‌లో స్మృతి మందాన స్క్వేర్ లెగ్ మీదుగా బౌండరీ, లాంగ్ ఆన్ మీదుగా సిక్సర్, మిడ్ వికెట్ మీదుగా మరో బౌండరీ బాది స్కోరు బోర్డును పరిగెత్తించింది. అదే ఓవర్లో స్క్వేర్ లెగ్ వద్ద అవుట్ నుంచి తప్పించుకుంది. తొమ్మిదో ఓవర్‌లో గార్డనర్ బౌలింగ్‌లో మరో ఓపెనర్ ప్రతికా రావాల్ లాంగ్ ఆన్ మీదుగా సిక్సర్, మిడాఫ్ మీదుగా బౌండరీ కొట్టి ఆసీస్ బౌలర్లను బెంబేలెత్తించింది. స్మృతి మందాన 46 బంతుల్లో 7 బౌండరీలు, ఒక సిక్సర్‌తో అర్ధసెంచరీ పూర్తి చేయగా..ప్రతికా రావల్ 69 బంతుల్లో 7 బౌండరీలు, ఒక సిక్సర్‌తో హాఫ్ సెంచరీ సాధించింది.

నాలుగు ఓవర్లలో ఐదు వికెట్లు

భారీ స్కోరు దిశగా సాగుతున్న భారత్ మహిళలు అనవసర షాట్లకు ప్రయత్నించి వికెట్లు పోగొట్టుకున్నారు. ఫలితంగా మరో ఏడు బంతులు మిగిలి ఉండగానే, 48.5 ఓవర్లకు ఆలౌటయ్యారు. వికెట్ల ముందు సెటల్ అయిన కెప్టెన్ హర్మన్ ప్రీత్ (22), రోడ్రిగస్ (33), రిచా ఘోష్ (32) అనవసర షాట్‌లతో వికెట్లు సమర్పించుకున్నారు. నాలుగు ఓవర్లలో వరుసగా ఐదు వికెట్లు పోగొట్టుకోవడం ప్రేక్షకులను తీవ్ర నిరాశకు గురిచేసింది.

సెంచరీతో హీలి కెప్టెన్ ఇన్నింగ్స్

ఆస్ట్రేలియా ఓపెనర్ అలిస్సా హీలి సెంచరీతో (142) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి భారత్ ఆశలపై నీళ్లు చల్లింది. మరో ఓపెనర్ లిచ్ ఫీల్డ్ (40) రాణించడంతో 15 ఓవర్లలోనే వంద పరుగులు పూర్తిచేసిన ఆస్ట్రేలియా దీటైనా జవాబు ఇచ్చేలా దూసుకుపోయింది. లిచ్ ఫీల్డ్ స్థానంలో దిగిన పెర్నీ (47; రిటైర్డ్ హర్ట్) క్రీజులో ఉన్నంతసేపు భారత్ మ్యాచ్‌పై పట్టు సాధించలేకపోయింది. అలిస్సా హీలి 84 బంతుల్లో 15 ఫోర్లు, ఒక సిక్సర్‌తో సెంచరీ పూర్తిచేసి పటిష్ఠ స్థితికి చేర్చింది. తర్వాత వచ్చిన ఆసీస్ బ్యాటర్లను భారత్ బౌలర్లు కట్టడి చేయడంలో విఫలమయ్యారు. సెకెండ్ స్పెల్‌లో అమన్‌జోత్ కౌర్ అద్భుత బౌలింగ్‌తో ఆస్ట్రేలియా బ్యాటర్లపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. రిటైర్డ్ హర్ట్ అయిన పెర్రీ తిరిగి బ్యాటింగ్‌కు వచ్చి స్నేహ రానా బౌలింగ్‌లో లాంగ్ ఆన్ మీదుగా సిక్సర్ బాదడంతో ఆస్ట్రేలియా 49 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి విజయం సాధించింది.

ఆరోగ్య పరిరక్షణపై
మహిళలు ప్రత్యేక దృష్టి సారించాలి

» మెగా వైద్య శిబిరం ప్రారంభోత్సవంలో కౌన్సిలర్ పద్మావతి



వైద్య శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ పద్మావతి

నర్సీపట్నం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆరోగ్య పరిరక్షణకు వైద్య శిబిరాలు నిర్వహించడం ఎంతో అవసరమని కౌన్సిలర్ చింతకాయల పద్మావతి అన్నారు. మున్సిపాలిటీ పరిధి జోగినాథుపాలెంలో విశాఖపట్నానికి చెందిన వెంకట రమణ ఆస్పత్రి, సింహాద్రి స్టీల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తొలుత ఈ శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. గర్భసంచి ద్వారా సోకుతున్న క్యాన్సర్ వంటి వ్యాధులపై మహిళలు అవగాహన పెంచుకోవాలన్నారు. స్క్రీనింగ్ పరీక్షల ద్వారా ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తిస్తే వైద్యం ద్వారా నయం చేసుకోవచ్చునన్నారు. ఇటువంటి శిబిరాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. అనంతరం పలువురికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కన్నయ్యనాయుడు, మాజీ చైర్మన్ ఆదిలక్ష్మి, పదో వార్డు కౌన్సిలర్ రాజునాయుడులతో పాటు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

చామంతిపురంలో రేషన్ డిపో ప్రారంభం


డిపోను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకుడు ఆర్.వై.పాత్రుడు

మాకవరపాలెం, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి) : మండలంలో చామంతిపురంలో కొత్తగా మంజూరైన రేషన్ డిపోను టీడీపీ మండల అధ్యక్షుడు అర్.వై.పాత్రుడు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపో పరిధిలోని కార్డు దారులకు సకాలంలో రేషన్ సరకులు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గోవింద, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి చిరంజీవి, చామంతి పురం నాయకుడు అప్పలరాజు, డీలర్ పాల్గొన్నారు.

'గొలుగొండపేటకు బస్సు సౌకర్యం కల్పించాలి'

నాతవరం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : నర్సీపట్నం డిపో నుంచి నాతవరం మీదుగా గొలుగొండపేటకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని గొలుగొండపేట గ్రామస్థులు కోరారు. ఈ మేరకు ఆదివారం జనసేన నాయకులు పోలుపర్తి శ్రీనివాసరావు తదితరులను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చుట్టు పక్కల గ్రామాలైన వెదురుపల్లి, చిక్కుడుపాలెం, అల్లిపూడి తదితర గ్రామాల్లో సుమారు పదివేల మంది జనాభా నివాసం ఉంటున్నారన్నారు. కానీ బస్సు సౌకర్యం లేకపోవడంతో అంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. నాతవరం నుంచి కోటనందూరుకు ఏడు కిలోమీటర్ల పరిధిలో నిత్యం లారీలు, స్కూల్ బస్సులు తిరుగుతున్నాయన్నారు. కానీ ఆర్టీసీ బస్సును మాత్రం నడపడం లేదని వాపోయారు. ఈ సమస్యను నర్సీపట్నం డిపో మేనేజర్ దృష్టికి తీసుకు వెళ్లి తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించేలా కృషి చేయాల్సిందిగా వారంతా విన్నవించారు.

ఇటు కోతులు.. అటు కుక్కలు..

» గొలుగొండ మండలంలోని పలు గ్రామాల్లో దీర్ఘకాలంగా సమస్య » తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు » పట్టించుకోని అధికారులు


కృష్ణాదేవిపేటలో ఓ ఇంటి ప్రహరీ గోడపై సంచరిస్తున్న కోతులు

కృష్ణాదేవిపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : గొలుగొండ మండలంలోని పలు గ్రామాల్లో కుక్కలు, కోతుల సమస్య వీడని పీడలా తయారైంది. ముఖ్యంగా ఏఎల్‌పురం, చోద్యం, పాతకృష్ణాదేవిపేట, నాగాపురం, జోగంపేట, చీడిగుమ్మల, కొంగసింగి, లింగంపేట, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో వీటి సంచారం అధికంగా ఉంది. దీర్ఘ కాలంగా వీటితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పట్టించుకునేవారు కరువయ్యారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. కుక్కలు వీధి వీధిన సంచరిస్తూ భయపెడుతున్నాయి. చిన్న పిల్లలపైన, సైకిళ్లు, బైక్‌లపై వెళుతున్న వారిని వెంబడిస్తున్నాయి. ఈ క్రమంలో పలువురు గాయపడిన సంఘటనలు కూడా ఉన్నాయి. చీకటి పడితే ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయంగా ఉందని కొందులు వాపోతున్నారు. పలువురు కుక్క కాట్లకు గురై ఆస్పత్రిలో చికిత్సలు కూడా పొందుతున్నారని అంటున్నారు.ఇక కోతుల విషయానికి వస్తే ప్రతి గ్రామంలో గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. ఇళ్లపైన, ప్రహరీ గోడలు, చెట్లపైన చెంగు..చెంగున గెంతులు వేస్తూ దడపుట్టిస్తున్నాయి. ఇళ్ల వద్ద సామగ్రిని, ఎండలో ఆరబెట్టిన బట్టలను చిందర వందర చేస్తున్నాయి. అలాగే, ఇళ్ల వద్ద పెంచుకునే మొక్కలతో పాటు పంటలను పాడుచేస్తున్నాయని పలువురు వాపోతున్నారు. పలుచోట్ల చిన్న పిల్లల చేతిలో ఉండే వస్తువులను లాక్కుంటుండడమే కాకుండా దాడి చేస్తున్నాయని అంటు న్నారు. వీటిని నియంత్రించాలంటూ అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా పట్టించుకునేవారు కరువయ్యారని చెపుతున్నారు. దీంతో వీటి సంఖ్య మరింత పెరిగిపోతున్నట్టు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రత్యేక దృష్టి సారించి కుక్కలు, కోతుల బెడద నుంచి కాపాడాలని వేడుకుంటున్నారు.


ఏఎల్‌పురం వీధిలో కుక్కల గుంపు సంచారం

ఇది కదా.. సంబరం

ఉల్లాసంగా.. ఉత్సాహంగా 'హ్యాపీ సండే'

నర్సీపట్నం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ ఆధ్వర్యంలో 'హ్యాపీ సండే' ఇక్కడ ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగింది. బీసీ గురుకుల పాఠశాల అవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో విద్యార్థినీ, విద్యార్థులు హాజరై జోష్ పుట్టించారు. మునిసిపల్ కమిషనర్ సురేంద్ర, ప్రభుత్వ పింఛనర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గజ్జాలమ్మ, వెలగా నారాణయణరావులు ముఖ్య అతిథులుగా హాజరై తొలుత దిశానిర్దేశం చేశారు. అనంతరం క్లాసికల్ డ్యాన్స్, స్కిట్స్, క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేసి నిర్వాహకులు అభినందించారు.


బీసీ గురుకుల పాఠశాల అవరణలో జరిగిన వేడుకలకు హాజరైన విద్యార్థినీ విద్యార్థులు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు మృతి

గొలుగొండ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : బైక్ ఢీకొని తీవ్ర గాయాలతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతిచెందినట్టు ఎస్ఐ రామారావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. మండల కేంద్రం గొలుగొండ దళిత కాలనీకి చెందిన మామిడి బావనారాయణ (61) శనివారం రాత్రి నడుచుకుంటూ రోడ్డుపై తమ ఇంటికి వెళుతున్నాడు. ఇంతలో కృష్ణాదేవిపేట నుంచి వస్తున్న బైక్ గొలుగొండ కలవ డిపో వద్ద ఢీకొనడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. పరిస్థితి విషమంగా మారడంతో వైద్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్టు ఎస్ఐ చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

శ్రీరాంపురం
యువతి కిడ్నాప్

» కాకినాడ జిల్లా చేబ్రోలులో పట్టుకున్న పోలీసులు

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలో యువతిని కిడ్నాప్ చేసి వివిధ ప్రాంతాల్లో కారులో తిప్పి కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో బెదిరిస్తుండగా పోలీసులు యువతిని, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన యువతి కర్రి వంశీ, మహమ్మద్ అల్తాఫ్ అనే ఇద్దరు వ్యక్తులను ప్రేమించింది. దీనిపై వారి మధ్య వివాదం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈనెల 11వ తేదీ ఉదయం పదకొండు గంటల సమయంలో అల్తాఫ్ సదరు యువతిని రాజానగరం బీచ్ వద్దకు తీసుకువెళ్లారు. అక్కడి నుంచి అల్తాఫ్, వంశీ, వంశీ స్నేహితుడు రాజు ఆమెను బలవంతంగా కారులో ఎక్కించుకుని వివిధ ప్రాంతాల మీదుగా తిప్పుతూ అన్నవరం, కత్తిపూడి మీదుగా చేబ్రోలు శివారులోని మట్టిరోడ్డులోకి తీసుకెళ్లారు. ఎవరో ఒకరిని తేల్చుకోవాలంటూ యువతిని వారు కొట్టి బెదిరించారు. మళ్లీ సాంబ అనే మరో వ్యక్తితో యువతిని బెదిరించడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని యువతిని, బెదిరించిన వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. యువతి ఫిర్యాదుపై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్టు గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

పోలీసుల తీరుపై 15న నిరసనలు

దేవరాపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పోలీసుల తీరును ఖండిస్తూ జిల్లాలోని అన్ని మండల కార్యాలయాల ఎదుట ఈనెల15న ఆందోళనలు చేపడతామని సీపీఎం జిల్లా నేత డి.వెంకన్న అన్నారు. నక్కపల్లిలో సీపీఎం నేత ఎం.అప్పలరాజును నిర్బంధాన్ని ఖండిస్తూ ఆదివారం నిరసన తెలిపారు. నక్కపల్లి మండలంలో బల్క్ డ్రగ్ పార్కును వ్యతిరేకంగా మత్స్యకారులు శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే అప్పలరాజును గృహ నిర్బంధించడం ఏ మేరకు సమంజసమన్నారు.

జనసేన పార్టీని బలోపేతం చేయాలి: ఎమ్మెల్యే పంచకర్ల


ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును సత్కరించిన జనసేన నాయకులు

కె.కోటపాడు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో జనసేన పార్టీని బలోపేతానికి జన సైనికులు కృషి చేయాలని పెందుర్తి ఎమ్మెల్యే, జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. మండలం సమీపంలో ఉన్న గుడిపాల గ్రామానికి వచ్చిన ఆయన కార్యకర్తలతో మాట్లాడారు. ఎక్కువగా మహిళలు, యువకులతో సభ్యత్వాలు కట్టించాలన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే పంచకర్లను మండల జనసేన ప్రధాన కార్యదర్శి కుంచా అంజిబాబు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాజి నారాయణమూర్తి, చింతల శ్రీను, జీలం ప్రదీప్, గురు శివ తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్లు సోకి ఎండిపోతున్న వరి పంట

కె.కోటపాడు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో మెట్ట ప్రాంతాల్లో రైతులు వరి నాట్లు వేశారు. అలాగే, ధాన్యం దిగుబడి అధికంగా వస్తుందని అంచనాలు సాగుతున్నాయి. మరోవైపు పంటకు అధికంగా చీడపీడలు ఆశించి ఎండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని సూరెడ్డిపాలెంలో ఎండిపోయినపొలాలను ఆదివారం ఏపీ రైతు సంఘం సభ్యులు వనము సూర్యానారాయణ, రొంగలి ముత్యాలనాయుడు పరిశీలించారు. ఈ గ్రామంలో 42 సెం ట్లలో పెన్నా సోనా అనే వరి రకం వేశానని, పంట ఎండిపోతోందని ఈర్లే దేవుడు అనే రైతు ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటి వరకు రూ. 20వేలు ఖర్చు చేసినట్టు తెలిపారు. ఇప్పటికే అనేక రకాల పురుగు మందులు పిచికారీ చేసినా తెగులు మాత్రం తగ్గటం లేదని వాపోయారు. ఇకనైనా పంట పొలాలను వ్యవసాయ అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని రైతు సంఘం సభ్యులు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.


పంటను చుపుతున్న రైతు దేవుడు

ఆలయ భూములకు నేడు, రేపు కౌలువేలం

చోడవరం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భమిడిపాటి సత్రం, గవరవరం కాశీ విశ్వేశ్వర ఆలయ భూములకు ఈనెల 13, 14 తేదీలలో కౌలు వేలం నిర్వహిస్తున్నట్టు దేవదాయశాఖ ఈవో ఎస్.వీ. సత్యనారాయణ తెలిపారు. భమిడిపాటి సత్రం భూములకు సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక హార్డింజి అతిథిగృహం వద్ద వేలం ఉంటుందని చెప్పారు. కాశీ విశ్వేశ్వరాలయానికి సంబంధించిన భూ ములకు ఈనెల 14 మంగళవారం గవరవరం కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద వేలం ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన రైతులు పాల్గొనాలని ఈవో విజ్ఞప్తి చేశారు.

16న మండల సమావేశం

చీడికాడ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల16వ తేదీన మండల సమావేశం జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. ఎంపిపి కురచా జయమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు మండల స్థాయి అధికారులు రావాలని ఆయన కోరారు.


ప్రమాదకర స్థితిలో ఉన్న వంతెన


వంతెనపై గుంతల్లో నిలిచిన వర్షం నీరు

శిథిలావస్థలో ఎం.కోడూరు వంతెన

» విరిగిన రెయిలింగ్, వంతెనపై గోతులు

» భయాందోళనలో వాహనదారులు

మాడుగుల రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కోడూరు గ్రామానికి ఆనుకుని ప్రవహిస్తున్న తాచేరు గెడ్డపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. చాలా ఏళ్ల కిందట నిర్మించిన ఈ వంతెనపై గల రోడ్డు గోతులతో అధ్వానంగా మారింది. ఈ వంతెనకు ఇరువైపులా రక్షణ స్తంభాలు విరిగిపోయాయి. వర్షం పడితే గోతుల్లో వర్షం నీరు నిలిచిపోతున్నది. దీంతో రాకపోకలకు వాహనదారులు భయపడుతున్నారు. రోడ్డు ఎత్తులో వంతెన దిగువన ఉండడంతో వర్షాలు పడితే రహదారిపైనుంచి వర్షంనీరు వచ్చి వంతెనపై చేరి నిలిచిపోతున్నది. ఎం.కోడూరు గ్రామస్థులతోపాటు కాశీపురం, కూర్మనాథపురం, కృష్ణంపాలెం, తాటిపర్తి, శంకరం, బిల్లలపాలెం, బొడ్డరేవు తదితర గ్రామాల ప్రజలు ఎం.కోడూరు మీదుగా మాడుగులకు ఈ వంతెన మీదుగా ప్రయాణాలు చేస్తుంటారు. గ్రామాల్లో పండించిన కూరగాయలను ద్విచక్ర వాహనాలు, ఆటోలపై ప్రతి సోమవారం మాడుగులలో జరిగే వారపు సంతకు తీసుకెళ్లి అమ్ముతుంటారు. ఈ క్రమంలో వంతెనను దాటుకుని వెళ్లేందుకు అవస్థ పడుతున్నారు. రక్షణ స్తంభాలు లేకపోవడంతో ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా తాచేరు గెడ్డలో పడిపోయి ప్రమాదాలకు గురయ్యే పరిస్థితులున్నాయి. పెద్ద వాహనాలు ఎదురెదురుగా వస్తున్నప్పుడు వంతెనను దాటుకుని వెళ్లేందుకు అవస్థ పడుతున్నారు. మాడుగులకు ఎం.కోడూరుతో పాటు పై గ్రామాలకు ఈ వంతెన మార్గమే ప్రధానం. అలాగే, మాడుగులకు రావాలంటే ఎం.కోడూరు నుంచి మరో మూడు కిలోమీటర్ల మేర చుట్టూ తిరిగి సాగరం మీదుగా రావాల్సి ఉంటుంది. ఇందువల్ల వ్యయప్రయాసలకు గురవుతున్నారు.

ప్రజల మధ్య ఐక్యత పెంపొందించేందుకు ఆర్ఎస్ఎస్ కృషి

» బ్రాండిక్స్ సీఈవో దొరై స్వామి

రావికమతం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల మధ్య ఐక్యత, పరస్పర గౌరవం, ఆదర్శాలను పెంపొందించడమే ఆర్ఎస్ఎస్ లక్ష్యమని బ్రాండిక్స్ సీఈవో దొరై స్వామి, బీజేపీ రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్ జి అన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల పురస్కరించుకుని కొత్తకోటలో స్వయం సేవకుల పద సంచలన సమావేశం ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ్ జీపీఎస్ నాయుడు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, భారతీయ జ్ఞాన సంప్రదాయాల పరిరక్షణ, ప్రోత్సహించడం ఆర్ఎస్ఎస్ ప్రథమ కర్తవ్యం మని అన్నారు. భారతీయులది సనాతన ధర్మమన్నారు. నిస్వార్థ భావనతో స్థాపించిన సంస్థ ఆర్ఎస్ఎస్ అని అన్నారు. సంఘ్‌లో చేరిన ప్రతి స్వయం సేవక్ మనస్సు, సాధనాల స్వచ్ఛత విలువల ఆధారంగానే జీవితాన్ని గడపడం నేర్చుకుంటారన్నారు. హిందువులందరినీ ఏకతాటిపైకి తీసుకురావడానికి పని చేస్తుందన్నారు. భారత దేశాన్ని ఆధ్యాత్మికంగా బలోపేతం చేయాలన్నారు. మారు మూల, సవాలుతో కూడిన ప్రాంతాల్లో విద్య, సామాజిక అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. ఆర్ఎస్ఎస్ వందేళ్ల పూర్తయిన సందర్భంగా సామాజిక సమరసత, పర్యావరణ పరిరక్షణ, సంస్కృతి పరిరక్షణ, పౌర నియమావళి, కుటుంబ ప్రబోధన్ తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, హిందూ బంధువులు, ఉభయ రాజకీయ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బ్రాండిక్స్ సీఈవో దొరై స్వామి

ఆర్అండ్‌బీ స్థలం ఆక్రమణ

రావికమతం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆర్అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించి రాకపోకలు సాగిస్తున్న బంకు యజమానిపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. రావికమతం నుంచి కింతలి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులో అద్దేపల్లి గెడ్డ సమీపంలో విశాఖపట్నంకు చెందిన ఓ వ్యక్తి పెట్రోల్ బంకు నిర్మాణం కోసం జిరాయితీ భూమిని కొనుగోలు చేశారు. సదరు భూమిలో పెట్రోల్ బంకులో పెట్రోలు, డీజిల్ అమ్మకాలకు వీలుగా నిర్మాణాలు చేపడుతున్నారు. అయితే, సదరు బంకును ఆనుకుని కింతలి వెళ్లే ఆర్అండ్‌వీ రోడ్డును ఆనుకుని ఉన్న స్థలాన్ని ఆక్రమించి ఇష్టానుసారంగా పనులు చేపడుతుండుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే బంకు పక్కనే ఉన్న బంజరు భూమి ఖాళీ స్థలాన్ని కూడా ఆక్రమించి పెద్దఎత్తున మట్టిని తరలించి నిల్వచేశారు. దీనివలన వర్షాల పడిన సమయంలో ఆ మట్టి అంతా రోడ్డుపైకి వచ్చి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. వాహనదారులు ప్రమదాలకు గురవుతున్నారు. ఆర్అండ్‌బి స్థలం ఆక్రమించినా సంబంధింత అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఆర్అండ్‌బీ మాడుగుల సెక్షన్ ఏఈ సాయి శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఆర్అండ్‌బిశాఖ స్థలం ఆక్రమణ విషయం నా దృష్టికి రాలేదని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.


అద్దేపల్లి గెడ్డ సమీపంలో ఆర్అండ్‌బీ స్థలం ఆక్రమించి నిర్మాణం చేపడుతున్న పెట్రోల్ బంకు

అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన


అంభేరుపురంలో శంకుస్థాపన చేస్తున్న పూతి కోటేశ్వరరావు దంపతులు

చోడవరం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి):మండలంలోని అంబేరుపురంలో అంబేద్కర్ నూతన విగ్రహం నిర్మాణానికి ఆదివారం రాష్ట్ర టీడీపీ నాయకులు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూతి కోటేశ్వరరావు దంపతులు భూమిపూజ చేశారు. గ్రామంలో అం బేద్కర్ పాత విగ్రహం దెబ్బతినడంతో ఆ స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు కోటేశ్వరరావు ఆర్థిక సాయమందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కార్లి ఈశ్వరమ్మ, స్థానిక పెద్దలు దేముడు, భాస్కరరావు మా స్టారు, లక్ష్మణకుమార్, సూరిశెట్టి గోవింద్, వేగి గంగేశ్వరరావు, అంబేద్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

82 మందికి వైద్య పరీక్షలు


కాశీపురంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

దేవరాపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశీపురం లోటస్ పాఠశాలలో ఆదివారం ఎన్ఆర్ఐ హాస్పిటల్, బీఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు ప్రఫుల్ చంద్ర, కీర్తి, యోగితాలక్ష్మి, శేషకుమార్ 82 మందికి పరీక్షలు చేశారు. కంటికి సంబంధించి ఆరుగురు, న్యూరో ముగ్గురు, గైనిక్ ముగ్గురిని మెరుగైన చికిత్సకు తరలించారు. ఆదర్శ వినియోగదారుల సంఘం అధ్యక్షుడు బి.త్రినాథరాజు, కొటాన రాంబాబు, ఆదిరెడ్డి చినకన్నబాబు, అప్పలనాయుడు, మంగునాయుడు పాల్గొన్నారు.

వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా రాంబాబు నియామకం



బుచ్చెయ్యపేట అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో వడ్డాదికి చెందిన స్థానిక జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబును వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారిచేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు పదవి కేటాయించిన మాజీ సీఎం జగన్‌కు, ఎమెల్సీ బొత్స సత్యనారాయణకు, మాజీమంత్రి బూడి ముత్యాలునాయుడుకు, చోడవరం ఇన్‌చార్జి అమర్‌నాధ్‌కు,ధర్మశ్రీకి కృత్ఞజతలు తెలిపారు.